తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

జులై-2020 ₹20/-



గోతెలుగు.కామ్
సాహిత్యఘుని

ఎంత చదివినా తరగని, మరవలేని కథలు
కడుపుబ్బ నవ్వించే కార్టూన్లు
ఎన్నో శీర్షికలు
మరెన్నో సమీక్షలు
ఎప్పుడైనా, ఎక్కడైనా

**www.gotelugu.com**

మీ హాస్యానందం
సంపూర్ణ హాస్య మాస పత్రిక

ఆన్‌లైన్‌లో గోతెలుగులో చదువుకోవచ్చు..!

**రచయితలు తమ రచనలను స్వయంగా అప్‌లోడ్ చేసుకోవచ్చు ఇప్పుడే...**

అప్లోడ్ చేయండి

రచయితలు, కార్టూనిస్టులు వారి రచన / కార్టూన్లను అప్లోడ్ చేసుకోవచ్చు.

Upload

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక

సంపాదకులు: రాము.పి

జులై-2020 ✦ 18వ సంవత్సరం ✦ 193 వ సంచిక

*Publisher& Editor*- Ramu.P

*Full Pillar*- Bnim

*Well Wishers:*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Mallik, Sanku
T.Chandra Sekhar

*D.T.P*
P. Ramalakshmi, 9440304993

*Perpetuals*
A.Dayakar, Ramakrishna,
Lepakshi, Bannu, Krishna
Bachi,Nagisetty, Nagraj, Venkat





ముఖచిత్రం: ఈషారెబ్బా
కార్టూన్: జయదేవ్


సంవత్సర చందా
రూ.300/-

2 సంవత్సరాల చందా
రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)



Editorial Office: **HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503,**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**



Hyderabad & Secunderabad Distributors:
**Charminar News Agencies,**
1-6-176/1, M.G.Road,
**Secunderabad**, Ph:8179627830
**Hyderabad.** Ph:8919181332


**ఓ చక్కటి చిరునవ్వే**
**ప్రతి ఇంటా అందమైన ఉషోదయం!**

## హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... సన్నిహితులకు**
**హాస్యాభివందనాలు**

ఆనందాన్ని ఎవరు కోరుకోరూ? నవ్వుని ఎవరైనా వద్దంటారా? ఇవి అందరూ ఆశించేవే... కోరుకునేవే! కానీ ఎంతమంది వీటికోసం ప్రయత్నం చేస్తున్నాం!...

ఏం చేస్తున్నాం?

చిన్న చిన్న పనులతో పొందే ఆనందాన్ని కూడా పొందలేక పోతున్నవారు ఎంతో మంది మన చుట్టూ ఉన్నారు! చిన్న పిల్లల బోసి నవ్వులు చూసి ఎంతమంది పరవశిస్తున్నారు? గార్డెనింగ్‌లాంటి పనులు చేస్తూ ఎంత మంది ఆనందాన్ని అనుభవిస్తున్నారు? పక్కవారితో హాయిగా మాట్లాడుతూ ఎంతమంది ఆహ్లాదంగా కాలం గడుపుతున్నారు?

మనకి మనమే నిజంగా శిక్ష వేసుకుంటున్నామా? అనవసరమయిన ఆలోచనలతో కాలం గడిపేస్తూ జీవితాన్ని సీరియస్‌మయం చేసుకుంటున్నాం! కారణాలు ఏవైనప్పటికీ మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఒత్తిడులను కాస్త దూరంగా పెట్టి ఇష్టమయిన పనులు సంతోషంగా చేస్తూ... తోటివారితో ఆనందంగా మనసువిప్పి మాట్లాడుతూ... హృదయపూర్వకంగా నవ్వగలిగితే... ఆనందం అందడమే కాదు... ఆరోగ్యం కూడా మన స్వంతమవుతుంది.

అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...



Ramu.P

**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

*Smile in every page Satisfaction in every smile*

# ఎక్కడెక్కడ ఏ ఏ నవ్వులున్నాయో...

## కథలు


| | | |
|---|---|---|
| లాక్ డౌన్-డేంజర్ జోన్ | -కంచనపల్లి ద్వారకనాథ్ | -16 |
| అప్పుల తిప్పలు | -బి.ఎస్.శర్మ | -20 |
| ప్రహేళికా పదబంధం | -బుద్ధవరపు కామేశ్వరరావు | -28 |
| ఆనందరావూ-ఎటిఎం | -డాక్టర్ చివుకుల పద్మజ | -34 |
| అమౌనం అర్ధాంగికాభరణం | -కట్టా రాంబాబు | -45 |


## సీరియల్స్


| | | |
|---|---|---|
| సుందరి-సుబ్బారావు | -మల్లాది వెంకటకృష్ణమూర్తి | -12 |
| ఇందు చందు-నవ్వులవిందు | -కంద్లకుంట శరత్‌చంద్ర | -22 |
| దెయ్యాల కొంప | -కోలపల్లి ఈశ్వర్ | -40 |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| శంకర్‌గారి రేఖాశీస్సులు | -శంకర్ నారాయణ | -8 |
| హాస్యానంద శతకం | -కంచనపల్లి ద్వారకానాథ్ | -10 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -18 |
| ఫన్ పంచ్ | -గుండు సుదర్శన్ | -50 |


## ప్రత్యేకం


| | | |
|---|---|---|
| నేరస్థులకి మందు | -జయదేవ్ | -19 |
| సెంటర్ స్మైల్ | | -26 |
| క్యా కరోనా | -తోపల్లి ఆనంద్ | -44 |
| సుత్తి | -ఎ.దయాకర్ | -49 |


## కార్టూన్ శీర్షికలు...


| | |
|---|---|
| సినీటూన్ | -4 |
| రాజ'కీ'యం | -5 |
| నవ్వులబడి | -6 |
| బుజ్జి హనుమా! | -7 |
| ప్రోత్సాహక బహుమతులు | -10 |
| రాజాధిరాజరాజమార్తాండ | -14 |
| అదన్నమాట | -15 |
| ఆఫీస్ టూన్ | -21 |
| కింకారావం | -24 |
| సైలెంట్ స్మైల్ | -30 |
| లాఫింగ్‌పిల్ | -31 |
| మన జనాలు | -32 |
| ఫ్యూచర్ పంచ్ | -36 |
| టింకు | -39 |
| ఈతరం కోడలు | -42 |
| మిస్టర్ కాక్ | -47 |
| కిక్కిక్కిక్కికి... | -51 |
| ది బెస్ట్ కార్టూన్ ఆఫ్ ది మంత్ | -52 |


**కథలకు బొమ్మలు-**
దయాకర్, కృష్ణ, వెంకట్, చైతన్య, సంగ్రామ్.


## ఈ సంచికలో కార్టూనిస్టులు

- ✦ జయదేవ్
- ✦ ఉత్తమ్
- ✦ ఏవీఎమ్
- ✦ సుభాని
- ✦ సరసి
- ✦ బాచి
- ✦ బన్ను
- ✦ రామశర్మ
- ✦ దయాకర్
- ✦ రామ్‌శేషు
- ✦ నాగిశెట్టి
- ✦ నాగ్రాజ్
- ✦ కృష్ణ
- ✦ సాయికృష్ణ
- ✦ హరగోపాల్
- ✦ కామేష్
- ✦ ఆదినారాయణరావు
- ✦ చక్రవర్తి
- ✦ దాస్
- ✦ కందికట్ల
- ✦ జకీర్
- ✦ టి.ఆర్.బాబు
- ✦ పెండేల
- ✦ తోపల్లి ఆనంద్
- ✦ ప్రసాద్ కాజ
- ✦ వినోద్
- ✦ అరుణ్
- ✦ ప్రసిద్ధ
- ✦ వడ్డేపల్లి వెంకటేష్
- ✦ గిరి
- ✦ జెన్నా
- ✦ కందికట్ల
- ✦ కళాధర్
- ✦ సి.ఆర్.రాజు
- ✦ సత్య
- ✦ నాథ్
- ✦ జకీర్
- ✦ దొరశ్రీ
- ✦ శ్రీధర్
- ✦ ఎన్.ధీరజ
- ✦ నూతి
- ✦ శ్రీకర్
- ✦ గాయత్రి


## సినీటూన్



BANNU*




# రాజ'కీ'యం




-సుభాని











టైమైపోతోంది...

త్వరగా జుట్టు పీక్కోండి...!!

అబ్బా...కార్టూన్లు వేయడంలో మునిగిపోతే మీకేదీ గుర్తుండదు....

అదేనండీ....

**గోతెలుగు.కామ్ మరియు హాస్యానందం**

**సంయుక్తంగా నిర్వహిస్తోన్న జుట్టు సబ్జెక్ట్ కార్టూన్ల పోటీ**

**కార్టూన్ల చివరాఖరు తేదీ 15 జూలై 2020**

**gotelugucontent@gmail.com**

**✦ సునీత వర్షిణి, సాయి శ్రీధర్, ఈమెయిల్**

**మా** కుటుంబసభ్యులు అందరూ హాస్యానందం అభిమానులం. లాక్‌డౌన్ సమయంలో మరియు ప్రస్తుత పరిస్థితులలో హాస్యానందంని చాలా గుర్తుతెచ్చుకున్నాము. కానీ ఒకేసారి మూడు ఎడిషన్‌లు (పోస్ట్‌లో) వచ్చేసరికి చాలా ఆనందం వేసింది. మూడు ఎడిషన్‌లోని హాస్యం మాకు చాలా ఆనందాన్నిచ్చింది. మా బంధువులు మరియు మిత్రులకు కూడా చెబితే వాళ్ళు కూడా చాలా బాగుంది ఈ మాస పత్రిక అని చెప్పారు. వారు కూడా సబ్స్క్రైబ్ చేయాలని అనుకుంటున్నారు. హాస్యానందం ఇలాగే హాయి... సానందంగా... కొనసాగాలని ఆశిస్తున్నాము.







**✦ ఎమ్.గురుమూర్తి, బెంగళూరు**


**హా**స్యానందం చందాదారుణ్ణి నేను. ఏప్రిల్ నెల నుండి గో తెలుగు.కామ్‌లో పత్రిక చదువుతున్నాను. ఈ నెల ఒకేసారి మూడు పత్రికలో పోస్ట్‌లో అందుకుని సంభ్రమాశ్చర్యానికి గురయ్యాను. మీ కమిట్‌మెంట్‌కి నా అభినందనలు. మూడు పత్రికల గురించి చాలా క్లుప్తంగా చెప్పదలచుకున్నాను. ఏప్రిల్ నెలలో బహుమతి పొందిన కథలు ఒక ఎత్తైతే... ఆ పోటీలో గెలుపొందిన విజేతలకు ఇచ్చే ప్రశంసాపత్రం కథతో పాటు ప్రచురించడం నిజంగా గ్రేట్ ఐడియా! ఇక మే సంచిక ఇంచుమించే యాభైమంది కార్టూనిస్ట్‌ల కామిక్‌లతో రూపొందిన ఈ సంచిక నభూతో నభవిష్యతి. జూన్ సంచికలో మధ్య పేజీలో శర్మగారి కార్టూన్లు ఈ సంచికని ప్రత్యేకంగా నిలబెట్టింది. మరోసారి మీకు అభినందనలు.

**✦ పి.వి. రామశర్మ కార్టూనిస్ట్,విశాఖపట్నం.**

**జూ**న్ 2020 నెల హాస్యానందంలో నా కార్టూన్లు సెంటర్‌స్ప్రెడ్‌లో ప్రచురించిన మీకు నా హృదయపూర్వక ధన్యవాదములు. ప్రతీ మూడు నెలలకోసారి ప్రచురించే ఈ సెంటర్‌స్ప్రెడ్ కార్టూన్ల సంకలనం ద్వారా ప్రతీ కార్టూనిస్ట్ తాను రచించిన కార్టూన్లలో కొన్ని ఒకచోట చూడడం, అందరి పాఠకులకు అవి చేరడం ద్వారా ఎంతో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని పొందుతారనడంలో సందేహం లేదు. జూన్ నెలలో నా కార్టూన్లు పాఠకులని అలరించాయనే నేను భావిస్తున్నాను. ముమ్ముందు మరింత ఉత్సాహంతో నా శక్తి మేరకు మరిన్ని కార్టూన్లు వేయడానికి ఈ సెంటర్‌స్ప్రెడ్‌లో వచ్చిన కార్టూన్ల పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. ముందు నుండీ కార్టూనిస్టుల పక్షాన, హాస్యరచయితల పక్షాన ఉంటున్న హాస్యానందం ఇటువంటి వినూత్న శీర్షికలు, ప్రయోగాల ద్వారా ఎంతో మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటుందనడంలో సందేహం లేదు. రాబోయే సంచికలలో అందరి కార్టూనిస్టుల కార్టూన్లు ఇలానే పాఠకులని అలరిస్తాయని మరొక్కసారి నా ధన్యవాదాలు, కృతజ్ఞతలు.

**✦ ఆర్.భార్గవి,గుత్తి**

**హా**స్యానందం జూన్ సంచిక షాప్‌లో చూసి హమ్మయ్య అనుకుని కొన్నాను. తీరా పత్రిక చూసాక... గత రెండు నెలల పత్రిక కూడా విడుదయిందని తెలిసి అర్జంట్‌గా చందాకట్టేసాను. నేనిక నిశ్చింతగా నవ్వుకోవచ్చు!




# బుజ్జి హనుమా!


వావ్! ఎన్ని గుడ్లో... పైగా ఆదివారం... ఈ రోజు ఎన్నో స్పెషల్ వంటలు వీటితో చేస్తా!
హేయ్ నక్కా!.. ఈ మధ్య అన్ని సైజుల్లో గుడ్లుగాని పెడుతున్నావా? అన్ని వున్నాయి?
ఆ...ఆ... అబ్బే! నాకు గుడ్లు కలక్ట్ చేయటం హాబీ! వీటిలోంచి పిల్లలు పుట్టగానే... ఐకమత్యంగా పెంచుదామనుకుంటున్నా!
ఎంత మంచివాడివి నక్కా! మా ఇంటి ముందు జాగా ఉంది... అక్కడ పొదిగించు... నేనూ అవి పొదిగే వరకు సాయం చేస్తా పద!
10.9.2019

Happy Birthday

# Shankar గారి రేఖాశీస్సులు



దయాకర్-జులై,1



ఆదినారాయణ-జులై,1



పి.వి.ఆర్.మూర్తి-జులై,1


ఉషారాజవరం-జులై,1


సరసి-జులై,5


చక్రవర్తి-జులై,7


పండరీనాథ్-జులై,7


రామకృష్ణ-జులై,11


కరుణాకర్-జులై,13


కూచిసాయిశంకర్ -జులై,13


కళాధర్‌బాపు-జులై,14



శేఖర్-జులై,16


వెంటపల్లి ఎస్.ఎన్.-జులై,20



రాగతి పండరి-జులై,22



వి3రమణ-జులై,22


సాయిరామ్ ఆకుండి-జులై,23


రవికుమార్ కొండా-జులై,24


వర్చస్వి- జులై,24


రావెళ్ళ శ్రీనివాసరావు-జులై,25


ప్రసాద్ కాజ-జులై,30

Happy Birthday

'జూన్' లో పుట్టిన కార్టూనిస్ట్ మిత్రులందరికీ
**జన్మదిన శుభాకాంక్షలు. -హాస్యానందం**

(అక్షజ్ఞవారి 'మన కార్టూనిస్టుల రూపురేఖలు' సౌజన్యంతో)

## ది బెస్ట్ కార్టూన్ ఆఫ్ ది మంత్ !

**ప్రోత్సాహక బహుమతి: రూ.1000/-**



మంచి కార్టూన్‌కి బహుమతి
ఇవ్వాలనే సరదాతో
**కార్టూన్ ఇష్టులు**
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన
కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి**
**రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.

ఈ నెల బెస్ట్ కార్టూనిస్ట్- **ప్రభాకర్**

కార్టూన్ 52 వ పేజీలో



కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన
**శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం...**
కార్టూన్ కళని ఆరాధిస్తున్న
కార్టూనిస్ట్‌లకు
**వాగ్దేవి పురస్కారం!**
ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి
**1000 రూపాయలు**
**మరియు ప్రశంసాపత్రం**
**శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు**
అందజేస్తున్నారు.





ఈ నెల పురస్కార గ్రహీత **-కృష్ణ**






కంచనపల్లి ద్వారకానాథ్, 9985295605

పండుగలకి వేసే కార్టూన్లు
పం(వండు)తాయి నవ్వుల పిండివం(పం) టలు
ఇవే నవ్వుకునే నవ్వుల విందులు
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** ॥64॥

వాట్సాప్ జోకులు
ఎంతదూరంలో వున్న వారికైనా క్షణాల్లో చేరుతాయి
నవ్వుల్ని అందరికీ పంచుతాయి
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** ॥65॥

రాజకీయాలపై వేసే వ్యంగ్యాస్త్రాలు
వేస్తారు కార్టూనిస్టు సవ్యసాచులు
అవి గుచ్చుకుని చురుక్కు మనిపించే అస్త్రశస్త్రాలు
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** ॥66॥

కార్టూన్లు, జోకులు, కామెడీలు
ఏవైనా ఆరోగ్య హాస్యాన్ని అందించాలి
అందరూ మెచ్చుకుని ఆనందించాలి
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** ॥67॥


వ్యంగ చిత్రకారులెందరో తెలుగు నేలలో
నవ్వుల పంటలు పండించే హాస్య(లి)కులు
కడుపు నిండా హాస్య భోజనం నింపి పొట్ట చెక్కలు చేసేరు
**నిక్కముగ నిజము చెప్పు హాస్యానందం!** ॥68॥



కార్టూనిస్ట్ శ్రీ జె.ఎస్.ఆర్. **(జె. శ్రీరామచంద్రమూర్తి గారు)**
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం **కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలని**
**ప్రతినెలా 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**

హాస్యానందంకు ఈనెల వచ్చిన
కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి
ఈ బహుమతి ఇవ్వబడుతుంది.

ఈనెల బహుమతి పొందిన కార్టూన్







ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారు,
తమ తల్లిగారు **శ్రీమతి అన్నం భాగ్యవతి(బాచి)గారి**
స్మారకార్థం ఈ కార్టూన్ పోటీలు
నిర్వహిస్తున్నారు.

| |
|---|
| మొదటి బహుమతి |
| రూ.5000/-, మెమెంటో, సర్టిఫికేట్ |
| రెండవ బహుమతి |
| రూ.3000/-, సర్టిఫికేట్ |
| మూడవ బహుమతి |
| రూ.2000/-, సర్టిఫికేట్ |
| పాల్గొన్నవారందరికీ సర్టిఫికేట్లు. |

## హాస్యానందం సౌజన్యంతో కార్టూన్ పోటీలు

హాస్యాభిమాని, కార్టూనిస్టులు
శ్రీఎస్.వి.రమణ,(హైదరాబాద్)గారు
తమ తల్లిదండ్రులు
**శ్రీసోమయాజుల శివరామయ్య, శ్రీమతి హైమవతి గార్ల**
స్మారకార్థం ఈ కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నారు.




| | |
|---|---|
| మొదటి బహుమతి- | రూ.2500/- |
| రెండవ బహుమతి- | రూ.1500/- |
| మూడవ బహుమతి- | రూ.1000/- |

**ఒక ప్రముఖ కార్టూనిస్ట్‌కి సన్మానం**


ముఖ్య గమనిక:
- ఇమెయిల్‌లో కార్టూన్లు పంపవద్దు!
- కార్టూన్లు A4 లోనే వేసి పంపవలెను.
- రెండు పోటీలకు విడివిడిగా పంపవలెను.

ఒకవేళ మెయిల్‌లో పంపాల్సివస్తే- రూ.100 పంపవలెను.

కార్టూన్లు పంపవలసిన చిరునామా: **A.SREEDHAR,** Advocate, 205, Capital Greens Apartments, Asram Road, Behind CSR Kalyana Mandapam, **TADEPALLI** Centre, Guntur District- 522 501. **Cell:9848992433**

**కరోనా లాక్‌డౌన్ల దృష్ట్యా బహుమతి ప్రదానోత్సవ సభ ఎప్పుడు నిర్వహించేది ఆగష్టు హాస్యానందం సంచికలో తెలియజేస్తాం!**

**కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : 20-07-2020**



# సుందరి-సుబ్బారావు
(వీళ్ళ పెళ్ళైంది!)

మల్లాది వెంకటకృష్ణమూర్తి

> ఇందులో జరిగిన కథ ఉండదు... అంతా జరుగుతున్న కథనే!..
> కాబట్టి ఇక్కడ్నుంచే మళ్ళీ చదవటం మొదలెట్టేయండి!

**"మీరు రోజురోజుకీ కొత్త రెండు వేల రూపాయల నోటులాంటి వారు అవుతున్నారు." సుందరి చెప్పింది.**

**"అంత విలువైన వాడిని అవుతున్నానా సుందరీ?" సుబ్రావ్ ఆనందంగా అడిగాడు.**

**"కాదు. మిమ్మల్ని మార్చలేను. వదులు కోలేను."**

ఈ అర్ధరాత్రి 12 నించి అన్ని పెళ్ళిళ్ళూ రద్దు.

1. పాత భార్యలు రేపటినించి చలామణీలో ఉండరు.
2. డిసెంబర్ 30 లోగా పాత భార్యలని కన్నవారింట్లో లేదా కోర్ట్‌లో జమ చేసి కొత్త భార్యని తీసుకోవాలి.
3. తర్వాతి రెండు రోజులూ కళ్యాణ మంటపాలు, రిజిస్ట్రార్ ఆఫ్ మేరేజెస్ ఆఫీస్‌లు, గుళ్ళు మూతపడతాయి.
4. నవంబర్ 30 నించి ప్రతీరోజు కొత్త భార్యతో రెండు గంటలు గడపచ్చు. క్రమంగా ఈ సమయం పెంచబడుతుంది.

"ఏమిటి కలవరిస్తున్నారు?" సుందరి తన భర్తని నిద్ర లేపి అడిగింది.

"ఛ! ఎందుకు లేపావు? ఎంత మంచి కల?" అతను విసుక్కున్నాడు.

**"మా** ఆవిడకి చెవుడు వచ్చినట్లుంది." సుబ్రావ్ ఇ అండ్ టి డాక్టర్‌తో చెప్పాడు.

"ఐతే మీరు నేను చెప్పినట్లు పరీక్షించాక చికిత్స మొదలు పెడతాను." ఎలా పరీక్షించాలో చెప్పి పంపాడు.

ఇంటికి తిరిగి వచ్చాక సుబ్రావ్ సుందరికి పదిహేను అడుగుల దూరంలో నిలబడి అడిగాడు.

"అన్నంలోకి ఏం చేస్తున్నావు?"

జవాబు లేదు.

సుందరికి పది అడుగుల దూరంలో నిలబడి మళ్ళీ అడిగాడు.

"అన్నంలోకి ఏం చేస్తున్నావు?"

మళ్ళీ జవాబు లేదు.

ఈసారి సుందరికి ఐదు అడుగుల దూరంలో నిలబడి అదే ప్రశ్నని అడిగాడు.

ఈ సారి కూడా జవాబు లేదు.

సుందరికి వెనకాలే నిలబడి అడిగాడు.

"అన్నంలోకి ఏం చేస్తున్నావు?"

"నాలుగుసార్లు అడిగారు. నాలుగుసార్లు చెప్పాను. కందిపచ్చడి, బెండకాయ కూర అని." సుందరి జవాబు చెప్పింది.

**"ఇది** వరకు మీ ఫ్రెండ్ గ్రీష్మారావు పెద్దగా నోరు విప్పేవాడు కాదు... ఇప్పుడు నోరు లేస్తోంది. ఏమైంది?"

"అతని భార్య కిందటి నెలే పోయిందని తెలీదా?"

**"నేను** మాట్లాడేటప్పుడు మీరు ఐదారుసార్లు ఆవలిస్తుంటారు. అదేం జబ్బో? డాక్టర్ దగ్గరకి వెళ్ళి చూపించుకోండి." సుందరి సూచించింది.

"అది జబ్బు కాదు. నేను మాట్లాడాలని ప్రయత్నిస్తుంటానంతే." సుబ్రావ్ చెప్పాడు.

**అర్ధరాత్రి** సుబ్రావ్‌కి మెలకువ వచ్చింది. చూస్తే పొగ, వేడి. తమ ఇల్లు తగలబడి పోతోందని గ్రహించగానే అతను సుందరిని నిద్రలేపాడు. ఇద్దరూ ఇంటి ముందు గది తలుపు తెరుచుకుని బయటికి వచ్చారు.

సుందరి ఆనందంగా నవ్వుతూండటం చూసి

సుబ్రావ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇదేమిటి? మన ఇల్లు తగలబడుతూంటే నీకు నవ్వెలా వస్తోంది?"

"గత నాలుగేళ్ళలో మీరు, నేను కలిసి బయటికి వచ్చింది ఇదే మొదటిసారి. కాబట్టి ఆ ఆనందం." సుందరి చెప్పింది.

**సుబ్రావ్‌కి** తీవ్ర అనారోగ్యం చేయడంతో సుందరి అతన్ని హాస్పిటల్‌లో చేర్పించింది. చిక్కి శల్యమై పక్క మీద ఉన్న సుబ్రావ్‌ని చూసి డాక్టర్ సుందరిని అడిగాడు.

"మీ వారికి ఇంత జబ్బు చేస్తే నాకు ఒక్కసారి కూడా కబురు చేయలేదే?"

"ఆయన ఇన్స్యూరెన్స్ చేసారు కాబట్టి." సుందరి నింపాదిగా చెప్పింది.

**"మీ** వారికి పూర్తి విశ్రాంతి అవసరం. ఇవి నిద్ర మాత్రలు." డాక్టర్ చెప్పాడు.

"మా వారికి వీటిని ఎప్పుడు వేయాలి?" సుందరి అడిగింది.

"అబ్బే! అవి ఆయనకి కాదమ్మా. మీకు." డాక్టర్ చెప్పాడు.

**"నేను** మరణిస్తే అప్పుడు నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకో." సుబ్రావ్ చెప్పాడు.

"ఒకవేళ మీరు నిజంగా పోతే నేను పెళ్ళి చేసుకోను. నా చెల్లెలి ఇంటికి వెళ్ళి దాంతో ఉంటాను. ఒకవేళ నేను పోతే అప్పుడు మీరేం చేస్తారు?" సుందరి అడిగింది.

"నేనూ పెళ్ళి చేసుకోను. నీలానే మీ చెల్లెలి ఇంటికి వెళ్ళి ఉంటాను." సుబ్రావ్ చెప్పాడు.

**"నేను** నిజంగా పోతే మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా?" సుందరి అడిగింది.

"ఆరోగ్యంగా ఉంటే చేసుకుంటాను."

సుబ్రావ్ జవాబు చెప్పాడు.

"ఆమెతో మనింట్లోనే ఉంటారా?"

"అవును."


"ఆమెని నా చీరలని కూడా కట్టుకోనిస్తారా?"

"అబ్బే! ఆమెకి చీరలు నచ్చవు. జీన్స్ కొనాలి." సుబ్రావ్ చెప్పాడు.

**"అదేమిటి?** కేన్సర్‌తో మూడు నెలల్లో పోతానని మళ్ళీ నన్ను పెళ్ళి చేసుకుని నిండు నూరేళ్ళు బతకమంటున్నారేమిటి? పెళ్ళి చేసుకుంటే బతుకుతానా?" ఓ రోగి ఆశగా అడగడం, దానికి డాక్టర్ జవాబుని సుబ్రావ్ విన్నాడు.


"బతకరు. కాకపోతే ఒకోరోజు ఒకో ఏడులా గడుస్తుంది."

**"మీ** వారు ఇరవై నాలుగు గంటలు మించి బతకరు. ఈ గండం గడిస్తే ఫర్వాలేదు." సుబ్రావ్‌ని పరీక్షించి డాక్టర్ సుందరితో రహస్యంగా చెప్పాడు.






ఒక తిక్కరాజు...ఒక బక్క మంత్రి కథ




తన భర్త ఆఖరి రాత్రి ఎంతో సుఖంగా ఉండాలని అనుకుంది ఆమె. ఆయన మంచం మీద మల్లెపూలు చల్లి, అగరొత్తులు వెలిగించింది. భర్త కోసం ఇంటి నించి వండి తెచ్చిన పసందైన భోజనం పెట్టింది.

ఆమెని భర్త ఓసారి కలిసాడు. గంటాగి రెండోసారి కలిసాడు. మళ్ళీ మూడోసారి కలిసాడు. నాలుగోసారి కూడా అతను సిద్ధం అయ్యేసరికి ఆమె విసుగ్గా చెప్పింది.

"టైం నాలుగైంది. మీకేం! రేపు ఉదయం మీరు నిద్ర లేవక్కరలేదు."

**"నా** చివరి కోరిక తీరుస్తావా సుందరి?"

"ఏమిటండీ అది?" ఆమె ప్రశ్నించింది.

"నువ్వు ఎలాగైనా మారుతీరావుని పెళ్ళి చేసుకోవాలి." చెప్పాడు సుబ్రావు.

"అదేమిటి? ఆయన మీకు శతృవు కదా?" సుందరి ఆశ్చర్యంగా అడిగింది.

"అందుకే... వాడు కూడా నాలా కుమిలి, కుమిలి చావాలని." సుబ్రావ్ కోరాడు.

**"ఏమండీ!** మీకు మళ్ళీ మొదటి నించీ జీవించే అవకాశం వస్తే ఏం చేస్తారు? నన్ను పెళ్ళి చేసుకుంటారా?"

"నువ్వు నన్ను చెంప మీద కొట్టనని మాట ఇస్తే సమాధానం చెప్తాను." సుబ్రావ్ జవాబు చెప్పాడు.

**"తినండి."** సుందరి చెప్పింది.

"ఇదేమిటి?" ఖాళీ ప్లేట్‌ని చూస్తూ సుబ్రావ్ అడిగాడు.

"డాక్టర్ గారు చెప్పిన వీగన్ భోజనమే ఇది. షుగర్ ఫ్రీ, సోయా ఫ్రీ, గ్లూటెన్ ఫ్రీ, సోడియం ఫ్రీ, కొలెస్ట్రాల్ ఫ్రీ, డైరీ ఫ్రీ డైట్ భోజనం. మీ జబ్బు తగ్గేదాకా ఇదే మీ డైట్." చెప్పి సుందరి ఎర్రటి ఆవకాయని వేడివేడి అన్నంలో కలుపుకుని తినసాగింది.

**"మీ** ఆయనకి అంత పెద్ద జబ్బు చేసినా ఎవరికీ చెప్పలేదేమిటి?"... సుందరిని, అక్క జేజెమ్మ అడిగింది.

"ఆయనకే చేయలేక విసుగేస్తోంది. ఇంక పరామర్శకి వచ్చేవాళ్ళకి కూడా చేయాల్సి వస్తుందని." సుందరి వివరించింది.

**2016లో** రియోలోని ఒలింపిక్స్‌ని సుబ్రావ్ టివిలో చూస్తున్నాడు. ఇండియన్ బాక్సింగ్ ఛాంపియన్ సాక్షి మాలిక్ మొదటి రౌండ్‌లో ఓడిపోయింది. ఆట విరామ సమయంలో ఆమె కోచ్ చెప్పాడు.

"చూడు మాలిక్! నీ ప్రత్యర్థి భవిష్యత్‌లోని నీ అత్తగారు అనుకుని ఆడు."


రెండో సగంలో ఆ ప్రత్యర్థికి తన మీదకి ఎక్కడ్నించి దెబ్బలు వచ్చి తగులుతున్నాయో కూడా తెలీకుండా తగిలి సాక్షిమాలిక్ గెలిచింది.

*డిసెంబర్‌లోకి, అంటే పెద్ద నోట్ల రద్దు జరిగిన కాలంలోకి ఆ పుణ్యదంపతులు ప్రవేశించాక...*

**సుబ్రావ్** మోడీకి ఓ ఉత్తరం రాసాడు.

మోడీ గారు,

బంగారం గురించిన మీ ఆలోచన బావుంది. అలాగే ఆడవారు ఏడాదికి పది చీరలు మించి కొనకూడదనే చట్టం కూడా తీసుకువచ్చి మగాళ్ళకి మేలు చేస్తారా?



సుబ్రావ్ మిత్రులతో రాజకీయాలు మాట్లాడుతూ చెప్పాడు.

"ఈ సారి నా ఓటు మోడీకే."

"ఏం?" గ్రీష్మారావ్ అడిగాడు.

"మా ఆవిడ ఇరుగు పొరుగుకి ఇంత బంగారం ఉంది, అంత బంగారం ఉంది అని నన్ను కాల్చుకుతినేది. నిన్నటి నించి నోరు మెదిపితే ఒట్టు."

**ఇంట్లో** అర కిలో కంటే ఎక్కువ బంగారం ఉంటే తీసుకెళ్తాం అని ప్రభుత్వం ప్రకటించాక సుబ్రావ్ సుందరిని కొత్తగా 'బంగారం' అని పిలవసాగాడు.

**లోలకం** తను ప్రేమించిన యువకుడి గురించి తల్లికి చెప్పింది.

వారి మధ్య కొంత చర్చ జరిగాక అతన్ని తండ్రికి పరిచయం చేయమని సుందరి సూచించింది.

ఓ రోజు లోలకం అతన్ని తన ఇంటికి తీసుకువచ్చి తండ్రికి పరిచయం చేసింది. కాఫీలు అయ్యాక సుబ్రావ్ అతన్ని అడిగాడు.

"సంతోషం. ఏం చేస్తుంటావు?"

"రామాయణం మీద రీసెర్చ్ చేస్తున్నాను సార్." అతను జవాబు చెప్పాడు.

"నువ్వు విద్యార్థివి అన్నమాట. మరి మీ పెళ్ళయ్యాక మీ అవిడని, పిల్లల్ని ఎలా పోషిస్తావు?"

"నాకేం కావాలో దేవుడే చూసుకుంటాడనే ధైర్యం నాకు ఉంది సార్."

"ఉదాహరణకి రేపు నిశ్చితార్థానికి మా అమ్మాయికి ఉంగరం పెట్టడం ఆచారం. మరి దాన్ని ఎలా సంపాదిస్తావు? పెళ్ళి ఖర్చుల్లో సగం పెళ్ళికొడుకు వైపు వారు పంచుకోవడం ఈ రోజుల్లో విధాయకం. ఆ ఖర్చులకి డబ్బుందా?"

"నా పనిని నేను శ్రద్ధగా చేసుకుంటూంటే, దేవుడే నాకు కావాల్సినవి సమకూరుస్తాడు సార్."

సుబ్రావ్ ప్రతీ ప్రశ్నకీ అతని జవాబులో దేవుడి మీద పరిపూర్ణ విశ్వాసం కనిపించింది. అతను వెళ్ళాక సుందరి అడిగింది.

"ఆ అబ్బాయి మీకు నచ్చాడా? బుద్ధిమంతుడేనా?"

"నచ్చాడు. బుద్ధిమంతుడే. కాని అతనికి నామీద ఎందుకో అంతులేని భక్తి ఏర్పడింది. నన్ను దేవుడు అనుకుంటున్నాడు." సుబ్రావ్ చెప్పాడు.

### షష్ఠి పూర్తి

**'భర్త** రిటైర్ అవగానే భార్యకి ఓవర్ టైం పెరుగుతుంది.' సుందరి తన డైరీలో సుబ్రావ్ రిటైరైన రెండు రోజుల తర్వాత రాసుకుంది.

**సుందరి** సుబ్రావ్ కళ్ళజోడుని తీసి అతన్ని పరిశీలనగా చూసి చెప్పింది.


"మీరు అచ్చం మన పెళ్ళి జరిగిన రోజుల్లోలా అందంగా కనిపిస్తున్నారు."

"కళ్ళజోడు లేకపోతే నువ్వు కూడా నాకు అలాగే కనిపిస్తున్నావు." సుబ్రావ్ చెప్పాడు.

**"మీరు** లోహపు వయసుకి చేరుకున్నారు కాబట్టి షష్ఠిపూర్తి చేసుకుందామండి." ఓ రోజు సుందరి భర్తని కోరింది.

"లోహపు వయసా? అంటే?" సుబ్రావ్ అర్థం కాక అడిగాడు.

"మీ జుట్టుకి వెండి, నోట్లోకి బంగారం, ఏక్సిడెంట్లో కాలు విరిగాక రాడ్స్ వేసారు... కాబట్టి కాళ్ళల్లో ఇనుము వచ్చాయి." సుందరి వివరించింది. **(సశేషం)**




తెలుగుతల్లి కెనడా వారు నిర్వహిస్తున్న

**శ్రీ గన్నవరపు సరోజినీ సత్యనారాయణ మూర్తి గారి స్మారక**

కార్టూన్ పోటీల కోసం కార్టూన్‌లను ఆహ్వానిస్తున్నారు.

**5 బహుమతులు ఒక్కొంటికి రూ 1,000 చొప్పున**

తెలుగు తల్లి కెనడా

కార్టూన్లు పంపవలసిన చిరునామా:

**A.SREEDHAR,** Advocate, 205, Capital Greens Apartments,
Asram Road, Behind CSR Kalyana Mandapam,
**TADEPALLI** Centre, Guntur District- 522 501. **Cell:9848992433**


కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ
**20-07-2020**



# లాక్ డౌన్- డేంజర్ జోన్

కంచనపల్లి ద్వారకనాథ్-
9985295605

**కరోనా తెచ్చిన కష్టకాలంలో లాక్డౌన్ కొందరికి మేలు... మరికొందరికి కుటుంబంతో కలిసి వుండే ఆనందం... కొందరికి బయట తిండ్లు, బార్లు లేక బోర్లు... స్నేహితులు కలవ లేక విసుగు, కంపరం వంటివి కూడా కలగక మాన లేదు. అలాంటి పరిస్థితుల్లో ఆఫీసు బంద్ చేసి కొన్ని రోజులు లాక్ డౌన్ వుండమన్నారన్న వార్తతో గిరి మహా ఆనందంతో గంతులేస్తూ ఇంటికి వచ్చాడు.**




బాత్‌రూమ్‌లో దూరి... కరోనాతో బడి మూసి ఇంట్లో కూర్చోపెట్టిన ఇద్దరు పిల్లలు రాజు, పింకీ, భార్య సుధ, అమ్మలతో కలిసి కొన్నాళ్లు అయినా హాయిగా వుండవచ్చు అని పగటికలలు కంటూ ఫ్రెష్ అయ్యి బయట పడ్డాడు.

రెండు మూడు రోజులు ఇంట్లోనే వుండే వాతావరణం ఒకరకంగా హాయిగానే గడిచింది మరుసటి రోజు మధ్యాహ్నం వున్నట్టుండి పిల్లలి ద్దరూ గావు కేకలతో పోట్లాడుకుంటున్నారు.

“ఏమైందిరా మీకు?” అంటూ గిరి తన రూములో నుండి బయటకు పరుగెట్టుకుంటు వచ్చాడు.

“చూడు నాన్న! నేనేమో బాహుబలి సినిమా చూస్తానంటుంటే పింకీ కార్టూన్స్ పెట్టుకుంటానని రిమోట్ లాక్కోంటోంది.” అన్నాడు రాజు.

“పోనిలేరా పింకీ చిన్న పిల్ల కదా రిమోట్ ఇవ్వరా!” అనగానే రాజు కోపంగా సోఫాలోకి రిమోట్ విసిరేసి– “మీకు పింకీ అంటేనే ఇష్టం!” అలిగి అక్కడ నుండి వెళ్లిపోయాడు.

వాళ్ళ ఇద్దరికి సర్ది చెప్పేటప్పటికి గిరి, సుధలకి ప్రాణం తోకలోకి వచ్చింది.

ఆ రోజు ఆదివారం పొద్దున్నే పేపర్ తేవడానికి గిరి బయలుదేరు తుండగా, గిరి అమ్మ “ఒరేయ్! ... గిరి నా మందులు అయిపోయాయి, మీ నాన్నకు హార్లిక్స్ తెచ్చి పెట్టరా!” అంది.

“అలాగే!” అంటూ బయటికి వెళ్ళాడు. బైక్‌లో సగం దూరం పోయే సరికి పోలీసులు ఆపి ఎన్నో ప్రశ్నలు వేసి చివరికి మాస్కు లేదనేసరికి బయలుదేరే హడావిడిలో మాస్కు మరిచిపోయింది గుర్తుకువచ్చి నాలుక కరుచుకుని వాళ్ళు చెప్పినట్లు ఏడుపు ముఖంతో గుంజీలు తీసి పేపరు, కావలిసినవి కొనుక్కుని నీరసంగా ఇంటి దారి పట్టాడు.

ఇంటికి రాగానే “అయ్! నాన్న సండే పేపర్, బుక్ తెచ్చాడు బుక్ నాకు నేను సెంటర్ పేజీలో పజిల్స్ పూర్తి చేస్తా” అంటూ చేతిలో పుస్తకం లాక్కున్నాడు రాజు.

అది చూసిన పింకీ–“నాన్నా! నాకు బుక్కు కావాలి నేను బొమ్మకి రంగులేయాలి”... అంటూ రాజు చేతిలో పుస్తకం లాక్కోవడంలో పుస్తకం కాస్త చినిగి పోవడంతో ఇద్దరిని కోపంగా చూస్తూన్న గిరి తలపట్టుకుని “సుధా! వీళ్ళ గోల చూడు ఈ మధ్య బడిలేక మాటబొత్తిగా వినడం లేదు... ఒకరికొకరు శత్రు వులు అయిపోయారు. ఛీ..ఛీ” అంటూ అక్కడ నుండి వెళ్లిపోయాడు.

“సుధా! ఆ సానిటైజర్ ఎక్కడపెట్టావ్ చేతులు కడుక్కోవాలి కనపడడం లేదు.”అడిగాడు.

“ఆ సింక్ దగ్గరే వుంటుంది. బాగా చూడండి. మీకు అన్నీ నేనే వెతికి ఇవ్వాలి. రాజుగాడు ఏమన్నా తీశాడేమో చూడండి!” అంది.

ఇంతలో పింకీ– “నాన్న! ఇందాక అన్నయ్య ఆ చేతులు కడుక్కునేది తీసి రుద్ది రుద్ది అంతా సింకులో పోసి దాన్ని డస్ట్‌బిన్లో పారేశాడు.” అంది.


గిరికి కోపం తారాస్థాయికి చేరి వాడిని అరవడంతో వాళ్ళ నాన్నమ్మ– “పిల్లలంటే అంతేరా వాళ్ళని ఏమి అనకు. అంటూ వాళ్ళని వెనుకేసు కొచ్చింది. ఏమి చేయలేని గిరి మాస్క్ లేకున్నా మూసుకుని వుండి పోయాడు .

ఆ రాత్రి తండ్రితోపాటు పిల్లల గురించి ఆలోచిస్తూ పడుకున్నాడు గిరి. కాసేపటికి ఏసీ మొరాయించి చెడిపోయింది. అసలే ఎండాకాలం దాని అలవాటు పడిన వాళ్ళ బాధ వర్ణనాతీతం. పొద్దున వరకు అటు ఇటు పక్కపై దొర్లి పొద్దునలేచి సుధా ఇచ్చే మధురమైన కాఫీ కోసం ఎదురు చూడగా ఎదురు దెబ్బ తగిలినట్లు వంటింట్లోనుండి–

“ఏమండీ! పాలు విరిగి పోయాయి... పాకెట్ తెస్తేకానీ కాఫీ తయారు కాదు” అనగానే... ‘ఛీ! పాడు జీవితం’ అని మనసులో అనుకుని ...

"పోతున్నా పాకెట్ తెస్తా!" అంటూ బయలు దేరాడు గిరి. పాలు అమ్మే వాడి దగ్గరకు పోగానే అక్కడనేలపైనా గీసిన వలయాల్లో దూర దూరంగా తనలాగే ముఖాలకు మాస్కు లేసుకుని నిలబడిన ఓ ఇరవైమంది దాకా వుండడం చూసి నిరాశ, నీరసంతో తన వంతు వచ్చే దాకా నిలబడి పాకెట్ తీసుకుని ఐదు వందల నోటు ఇచ్చాడు.

"సార్... చిల్లర... చిల్లర కావాలి. వచ్చిన ప్రతివాడు పెద్ద నోట్లు ఇస్తున్నారు. ఒక పాకెట్ కోసం ఐదువందలు ఇస్తే ఎట్లా సార్ నా దగ్గర చిల్లరలేదు...కొద్దిసేపు వెయిట్ చేయండి. ఎవరైనా వస్తారేమో... అని గిరిని ఓ ఇరవై నిముషాలు నిలపెట్టి చిల్లరదొరక్క పక్క కొట్లో కెళ్ళి మరో




పది నిముషాలు వుండి చిల్లర తీసుకుని వచ్చి ఇచ్చేసరికి గిరికి కడుపులో గడబిడ మొదలైంది.

అక్కడనుండి అలా బయట పడిన గిరి ఇంటికి వచ్చి సుధాతో కాఫీ చేయించుకుని గబగబా తాగి బాత్రూమ్ వైపు దారితీశాడు.

బాత్రూంలో నుండి కూని రాగాలు తీస్తూ రాజు దోరు వేసుకుని వున్నాడు.

గిరికి కడుపులో గడబిడ ఎక్కువైంది.

లాభం లేదు అని పక్కరూము బాత్రూమ్‌లో కెళ్లలని అక్కడకు పోతే... అప్పుడే సుధా స్నానానికి పోయింది.

గిరి పరిస్థితి దేవుడెరుగు. ఇంక ఆగలేక రాజుగాడున్న బాత్రూమ్ తలుపుతట్టాడు.

"నాన్న!... ఎందుకు తలుపు తడుతున్నావు? నీకు ఆఫీసు లేదు కదా... కాసేపు వెయిట్ చేయి!" అంటూ రాగం తీయసాగాడు.

"ఒరేయ్! రాజు నీకు దండం పెడుతారా... త్వరగా బయటికి రా! ఆగలేకపోతున్నా ..." అన్నాడు లో స్వరంతో.

నాన్న బాధ అర్థం చేసుకున్నా రాజు తలుపు తీసి బతికి రాగానే శరవేగంతో బాత్రూమ్‌లోకి దూరాడు గిరి.

కాలకృత్యాలు తీర్చుకుని, టవల్‌తో తుడుచుకుంటూ– 'ఈ ఇరవై రోజుల లక్డౌన్‌కే ఇంత టెన్షన్ భరించిన నేను... ఈ లాక్‌డౌన్ పొడిగించిన తరుణంలో ఈ టార్చర్‌కి... నా బతుకు బస్టాండ్ అయిపోతోందిరో నాయనా ... ఇది లాక్ డౌన్ కాదు... డేంజరస్ జోనే నాకు మాత్రం.' అని మనసులో అనుకుంటుండగా వంటింట్లో నుండి సుధా– "ఏమండీ! పిల్లలు తగువు వేసుకుంటున్నట్టున్నారు పోయి చూడండి... ఏవో వస్తువులు పగిలిన చప్పుడైంది." అంది.

ఇంట్లో ఈ గొడవలు, పనుల కంటే ఆఫీసులో పనులే నయం... బాస్ ఎంతో నయమనిపించాడు గిరికి.


# తర్కారావు కథలు



గంగాధర్ వడ్లమన్నాటి-9908445969

## మూతి తుడుచుకో బాబూ...

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతాననంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**



వెళ్తున్న కార్‌ని ఆపమన్నట్టుగా చేయి ఊపి, ఆ కార్‌ని ఆపారు శేఖరంగారు.

కారు ఆగగానే, శేఖరంగారు కంగారుగా ఆ కారు నడుపుతున్న వ్యక్తి వద్దకు వెళ్ళి-

"బాబూ!... మా అమ్మాయి ఓ ఎంట్రన్స్ పరీక్షకి వెళ్తోంది. మా టైం వరస్ట్‌గా ఉండి మా కార్ టైర్ బరస్టైంది. సమయానికి స్టెప్నీ కూడా మా దగ్గర లేదు... మీ వద్ద స్టెప్నీ ఉంటే..." అడిగాడాయన మొహమాటంగా.

"భలే వారే! అంత చిన్న సాయం అడగడానికి ఇంత పెద్దగా మొహమాట పడిపోవాలా! ఉండండి, నేనే ఆ స్టెప్నీ తీసి బిగిస్తాను. మీరు పెద్దవారు. కంగారు పడకుండా నిదానంగా ఉండండి. చెప్పాడు మధు పెదాలు తడుపుకుని, శేఖరంగారి అమ్మాయి వంక తినేసేలా చూస్తూ.

ఆ కక్కుర్తి చూపులు భరించలేక, కొంచెం తలని అటు వైపుకి తిప్పేసిందామె.

కానీ మధు మాత్రం ఆమెని ఆత్రంగా చూడటం ఆపలేదు. అది గమనించిన శేఖరం గారు పళ్ళు పట, పటా కొరికేస్తూ-

"బాబూ! నీ మూతి తుడుచుకో... నీ చొక్కా తడిచిపోతోంది" అంటూ కర్చీఫ్ అందించాడాయన.

ఆ మాటలకి ఉలిక్కి పడి, "ఓహ్!... సారీ అంకుల్ అని తన జేబులోని రుమాలుతో తన చొంగ తుడుచుకున్నాడు.

ఆ తర్వాత కొంతసేపటికి- "మేడమ్! మీ గాడీ రెడీ. మీరిక తక్షణమే లక్షణంగా పరీక్షకి వెళ్ళవచ్చు." చెప్పాడు పళ్ళు బయటపెట్టి, ఒళ్ళు మరిచిపోయి చూస్తూ.

ఆమె అతని దగ్గరకి చక చకా నడిచి వచ్చి-

"థాంక్స్!" అని మొక్కుబడిగా అనబోతూనే ఆగిపోయింది. కళ్ళు పెద్దవి చేసి చూసింది. పళ్ళు బలంగా కొరికింది. తర్వాత, స్టుపిడ్ అని తిట్టి చాచి లెంపకాయ్ కొట్టింది.

"ఇప్పుడు చెప్పు సుబ్బారావ్! ఆమె థ్యాంక్స్ చెప్పడానికి బదులు అతన్ని చాచి లెంపకాయెందుకు కొట్టింది? అసలు ఏం జరిగి ఉండవచ్చు? నువ్వు కాస్త దగ్గరగా చెప్పినా నీ జీతం పెంచేస్తాను." చెప్పాడు తర్కారావ్.

"ఇది తేలికే సార్! అయినా మరీ అతను ఆమెని టైరు మారుస్తూ అలా మింగేసేట్టూ... నమిలేసేట్టూ... తినేసేట్టూ చూస్తే ఏ అమ్మాయికైనా వాడ్ని కప్పెట్టేంత కోపం రాకుండా ఉంటుందా సార్.అందుకే కొట్టుంటుంది.... అంతేనా సార్!" అడిగాడు ఆశగా.

"కాదు సుబ్బారావ్! అసలు జరిగిందేవిటంటే... అతను ఆమెని తినేసేలా చూసే క్రమంలో, అతను పంక్చరైందని తీసేసిన టైరునే మళ్ళీ బిగించేసాడు. అది గమనించిన ఆమె, పరీక్షకి టైమైపోతుంటే వీడు ఇలా చేసి నా సమయం ఇంకా వృథా చేసాడే అనే పట్టరాని కోపంతో చెంప పగలకొట్టింది. అదీ అసలు సంగతి. నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు" అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా!" అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళి పోయాడు సుబ్బారావు.


జ్వరాలకి జనం మన మందులు వాడటం లేదా...?
మన వైద్య శిరోమణి ఏం పీకుతున్నట్లు?
మందు మొక్కలు పీకుతున్నాడు రాజా!
వాటితో కషాయాలు కాచి జనానికి అమ్ముతుంటాడని వార్త!!
ఒరేయ్ ఆ వైద్యుణ్ణి ఈడ్చుకురండి కషాయాల్తో!!
ఒక గంట తర్వాత...
ఏమయ్యా కషాయాలు అమ్ముతున్నావా... అవి తాగితే రోగాలు పోతాయా?
ఏదీ నీ కషాయాలని నువ్వే తాగు చూద్దాం
వొద్దు మహాప్రభో పిల్లలు గలవాణ్ణి...
ఒరేయ్ తాగించండ్రా
వైద్యుడు కషాయాలు తాగి పైకే.. పోయాడు
భలే కషాయం.. ఇకనుంచి నేరస్తులకిదే మందు శిక్ష... తాగించండ్రా...
ఒరేయ్ ప్రజా వెధవల్లారా రోగాలు అంటించుకొంటుండే... తుంటే.. ఈ మందు
మీకు పట్టిస్తాం... ఖబర్దార్ జాగ్రత్త...!
Jayadev



# అప్పుల తిప్పలు


## (అప్పుల అప్పారావుకి తొమ్మిది సూత్రాలు)

బి.ఎస్.శర్మ
9246101884

**"డబ్బు ఇచ్చి పుచ్చుకోవడాలవల్ల స్నేహాలు చెడుతాయి" అని మనశాస్త్రాలు అనేక సందర్భాలలో హెచ్చరించాయి. అందువల్ల డబ్బులతో వ్యవహారంలో చాలా జాగ్రత్త వుండాలి.**

**ఋణ గ్రహీత కానీ, ఋణప్రదాత గాని కావద్దు.**

**పరస్పర వాగ్వాదం వల్ల ఆర్థిక సంబంధాలు, స్నేహితుని భార్యతో అతిగా మాట్లాడటం వల్ల స్నేహం చెడిపోయే ప్రమాదం ఉందని ఈ క్రింది శ్లోకంలో ఋషులు వివరించారు.**




(Neither a borrower nor a lender be) అని ఆంగ్ల రచయిత షేక్స్‌పియర్ రచించిన హామ్లెట్ నాటకంలో పొలోనియస్ వాడు తన కుమారునికి సలహా ఇచ్చాడు.

మహాభారతంలో విదురుడు డబ్బుతో వ్యవహారాలు, ఇతర లావాదేవీలు అస్సలు నెరపకూడదని వారి జాబితా చెప్తాడు.

శ్లో॥ **ఘృణీ, రాజా, పుంశ్చలీ, రాజభృత్యః**
**పుత్రో, భ్రాతా, విధవా, బాలపుత్రా**
**సేవాజీవీచోద్ధృతభూతిరేవ**
**వ్యవహారేషు వర్జనీయాః స్యురేతే॥**

(మహాభారతం - ఉద్యోగ -5)

ఘృణీ = దయకలవాడు, రాజా = రాజు (నాయకుడు, యజమాని, అధికారి) పుంశ్చలి = వ్యభిచరించు స్త్రీ, రాజభృత్యః = రాజసేవకుడు, పుత్రః = కొడుకు, భ్రాతా = సోదరుడు, బాలపుత్రా విధవా = చిన్నపిల్లలు గల విధవ, సేవాజీవీ = సైనికుడు, ఉద్ధృత భూతిః ఏవచ = సంపద కోల్పోయినవాడు, ఏతే = వీరు, వ్యవహారేషు = వ్యవహారములందు, వర్జనీయాః స్యుః = వదలిపెట్టతగినవారు.

**1. ఘృణీ** – దయగలవాడు. (అప్పు తీసుకుకొన్నా, ఇచ్చినా కష్టమే). నీవు 'దయ' కలవాడవైతే గట్టిగా మాట్లాడటం రానివాడవైతే డబ్బు ఎవరికీ అప్పు ఇవ్వకు అంటోంది శాస్త్రం. "తిరిగి పొందటంలో ఇబ్బంది పడతావు" అని భావము. మనకెందరికో అనుభవమే ఇది.

**"పుస్తకం, వనితా, విత్తం పరహస్తం గతం గతః**
**అథవా పునరాయాతి జీర్ణం భ్రష్టా చ ఖండశః"**

అన్న పై శ్లోకంలో హెచ్చరిక విన్నా–అప్పుల తప్పులు చేస్తూంటాం. గోతులో పడతాం. పుచ్చుకొన్న 'ప్రభువు' అప్పుడప్పుడు ఇచ్చిన చిరుమొత్తాల్ని తీసుకొని తృప్తి పడటమే మనముందున్న అవకాశం. (ఇతరుల చేతిలో పడిన డబ్బు పోయినట్లే. ఒకవేళ వస్తే ముక్క ముక్కలుగా వస్తుంది. పుస్తకము, వనిత కూడా పరహస్తగతమైనపుడు తిరిగి రావటం కష్టమే. ఒకవేళ వచ్చిన యథాపూర్వ స్థితిలో ఉండటం కష్టం.

ఓ దయగల అమాయకుడా! దయచేసి తిప్పలు కొనితెచ్చుకోకు అన్నది విదురనీతి.

**2. రాజు** – మీ యజమాని నుంచి అప్పు తీసుకోకు... ఆయనకు అప్పు ఇవ్వకు. ఇచ్చావా? అడగలేవు. తీసుకొన్నావా? మరీ ప్రమాదం. రోజూ కనిపిస్తాడు. కనిపించినపుడల్లా అడుగుతాడు... ఆలస్యం చేస్తే 'జీతం'లో పట్టుకొంటాడు. జాగ్రత్త!

**3. పుంశ్చలీ–** (వార వనిత అని నిఘంటువు చెప్పే అర్థం–వేశ్య) ఏ కారణం గానైనా వారవనితలనుండి డబ్బు లావాదేవీలు నడిపామా? అంతే సంగతులు – అదోరకం ప్రమాదం. డబ్బు బదులిచ్చి, తిరిగి తీసుకోవటానికి వాళ్ల వాడలకి వెళ్లలేం – వెళ్తే, నా పై అత్యాచారం చేసాడు మొర్రోయ్" అని అరిచిందే అనుకో– ప్రజలు ఆమెనే నమ్మే ప్రమాదం వుంది. కాక – మనింటిపైకి 'వసూలు' కోసం వచ్చినా ప్రమాదమే కదా! ఇటువంటివారితో లావాదేవీల విషయంలో ఆలోచించమని హెచ్చరిక!

**4. రాజభృత్యులు** –రాజభటులు / రాజసేవకులు, ప్రభుత్వ ఉద్యోగులు/ రక్షకభటులు వర్గానికి చెందిన ఈ వర్గానికి చెందిన వాళ్లు చాలా పలుకుబడి ఉన్నవాళ్లు. వాళ్లకు అసంతృప్తి కల్గించావంటే ఏదో అభియోగంలో ఇరికించేస్తాడు. ప్రమాదంలో పడతావ్ అంటుంది శాస్త్రం. పోలీస్ డిపార్ట్‌మెంటువాళ్లు – వసూలుకి మీ ఇంటికొస్తే, రభస చేస్తే, ఈడ్చుకెళ్తే– అమ్మో! ఆలోచించండి. అందుకని ఇటువంటి వారితో వ్యవహారాలు నడపవద్దని విదురనీతి.

**5. పుత్రుడు, భ్రాత** – (కుమారుడు, అన్న, తమ్ముడు వంటి రక్త సంబంధీకులు) బంధువులతో డబ్బు లావాదేవీలు ప్రమాదకరమే అన్నాడు విదురుడు.

'అడగలేవు–మొహమాటపడతావు' అని హెచ్చరిక కాబోలు!

**"మాతాపుత్ర విరోధాయ హిరణ్యాయ నమో నమః"** అని ఆర్యోక్తి – (తల్లికీ – కుమారునికీ విరోధం పెట్టే ఓ హిరణ్యమా నీకో దణ్ణం). రక్తసంబంధీకులతో వ్యవహారాలు నడిపినప్పుడు – భాగస్వాములుగా చేసికొన్నప్పుడూ వచ్చే సమస్యలను మహాభారతం మనకు గుర్తు చేస్తోంది.

**6. బాలపుత్రా విధవా–** (చిన్న పిల్లలు ఉన్న విధవలు) వీరు సమాజంలో 'కరుణ' చూపించాల్సిన వ్యక్తులు. వీరితో వ్యవహారం కత్తిమీద సాము లాంటిది. వీరిపై సమాజానికి సానుభూతి ఉండాలి. సమాజానికి వీరి వెనుక ఎవరూ లేరనుకొని అన్యాయం చేద్దామని భావించకూడదు.

**7. సేవాజీవి–** (సైనికుడు) సైన్యంలో వున్నవారితో డబ్బు లావాదేవీలు వద్దని కాబోలు విదురుడు వీరిని కూడా ఈ జాబితాలో పెట్టాడు.

**8. సంపద కోల్పోయినవారు (దివాళా తీసినవారు)** – వ్యాపారంలో భారీ నష్టాల్లో కూరుకొనిపోయినవారికీ, అప్పులిచ్చినట్లయితే మీ సొమ్ము తిరిగిరాదు అని అంటోంది మహాభారతం.

ఈ విధంగా ఈ వర్గానికి చెందిన అప్పుల అప్పారావులకు విజ్ఞులు ఋణ ప్రదానం చేయవద్దని మహాభారతంలో విదురుడు హెచ్చరించాడు.









**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి పంపిన ఈమెయిల్ పట్టుకుని స్నేహితుని దగ్గరకు వెళ్తాడు చందు. అక్కడ రామం భార్య విషయం తెలిసి చందుకి ఓ సంబంధం గురించి చెబుతుంది. ఆ అమ్మాయిని హోటల్‌లో కలుస్తాడు చందు. ఆ అమ్మాయి చందుకి నచ్చదు. రచన డాన్స్ నేర్పించడానికి ఇందువాళ్ళింటికి వెళ్తుంది. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం జరుగుతూంటుంది...

ప్రస్తుతం...

**డాక్టర్‌గారు తన స్పందనను తెలియజేస్తూ- "ఈ సన్మానం చూసాక నాకు ఓ సంఘటన గుర్తొస్తోంది. నేను ఎంబీబీఎస్ చదివే రోజుల్లో, ఓ హాస్పిటల్‌లో జరగబోయే సర్జరీకి వెళ్ళాం. ఐతే, మాకా సర్జరీ గురించి టీచ్ చేసే మా ప్రొఫెసర్ ఆ రోజు లీవ్ పెట్టింది. ఆమె బదులుగా, ఆ రోజు అనాటమీ ప్రొఫెసర్‌ను మాతో పాటు పంపారు. అక్కడ సర్జరీ జరుగుతుంటే... మాతో వచ్చిన ప్రొఫెసరేమో... పోస్ట్‌మార్టం ఎలా చెయ్యాలో చెప్తున్నాడు. పేషంటుకేమో ఇంకా అనస్థీషియా ఎక్కలేదు. మధ్యమధ్యలో పోస్ట్‌మార్టం అనే పదం ఆ పేషంట్ చెవిలో పడుతోంది. అంతే, ఆ పేషంటు గట్టిగా కేకలు వేసి, కిందికి దూకి పారిపోవాలని తెగ ప్రయత్నం చేసాడు. నా పాత రోజులను తలుచుకునేలా చేసిన శ్రీ రాఘవరావు గారికి థాంక్స్." అన్నారు.**

**రాఘవరావుకు, ఇంకా తాను చేసిన తప్పేంటో తనకు అర్థం కాలేదు. డాక్టర్ గారు నిజంగానే తనను పొగిడారనుకొని తెగ మురిసిపోయాడు.**

**చందు, రామం లోపలికి వచ్చారు. రామం, తన చేతుల్లో ఉన్న పూల ప్యాకెట్‌ను రచనకు అందించాడు. ఆమె గ్రీన్ రూములోకి వెళ్ళిపోయింది.**

'ఇప్పటికి నాలుగు ప్రోగ్రాంలు అయిపోయాయి.' మనసులో అనుకున్నాడు ఓలే.

ఐదో ప్రోగ్రాంగా మరో కామెడీ స్కిట్ మొదలయ్యింది.

ఆరో ప్రోగ్రాంలో డాన్స్ చేయబోయే అమ్మాయినే ఓలే కిడ్నాప్ చెయ్యాలి. ఆ అమ్మాయి ఎవరయ్యుంటుందా అని టెన్షన్‌తో చూస్తున్నాడు.

కామెడీ స్కిట్ మొదలయ్యింది.

ఐతే ఈసారి ఆ స్కిట్‌లో నల్గొండ, విజయవాడ బార్డర్‌కు చెందిన ఇద్దరు భార్యాభర్తలు పర్ఫార్మెన్స్ ఇచ్చారు.

(భార్య ఇంట్లో ఏదో పని చేస్తున్నట్లు నటిస్తోంది. భర్త, బయటి నుండి ఇంట్లోకి వచ్చాడు.)

భార్య- ఏంటండీ... అట్లా ఉన్నారు?

భర్త- ఒకటా రెండా ఎన్నో సమస్యలు నాకు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

భార్య- మన తెలుగు టీవీ సీరియల్ ఒకటి

చూడండి.వాటిలో ఎన్నో సమస్యలు. అవి చూస్తే... మీ ప్రాబ్లంస్ ఏవీ..పెద్ద ప్రాబ్లంస్ లా అనిపించవు.

భర్త(సైడ్‌కు తిరిగి)– సరేలే, నీ కంటే పెద్ద ప్రాబ్లం నాకేముంటుంది. నువ్వే నాకో ప్రాబ్లం అనుకుంటుంటే... మళ్ళీ టివి సీరియల్స్ చూడాలా?

భార్య– ఏంటీ? ఏంటో అంటున్నారు?

భర్త– ఏం లేదులే గానీ, మన పిల్లోడికి ఎగ్జాంలో ఎన్ని మార్కులు వచ్చాయి?

భార్య– వాడి మొహం! వాడేం సరిగ్గా చద వడం లేదు. వాడిని తిడుతూ టీచర్ నాకు ఫోన్ చేసి చెప్పింది.

భర్త– నా బంగారుకొండ... అన్నీ నా పోలి కలే మనోడికి.

భార్య– ఏడ్చినట్లే ఉంది. వాడు ఈ మధ్య, ఇంట్లో డబ్బులు దొంగతనం చేస్తున్నాడు ఇంట్లో.. డబ్బులు ఎక్కడ దాయాలో అర్థం కావడం లేదు.


భర్త– వాడెలాగూ సరిగ్గా చదవడం లేదంటు న్నావ్ కదా! సో... సింపుల్! వాడి పుస్తకాలల్లో దాచిపెట్టు. ఎలాగూ బుక్స్ తెరవడు... డబ్బులూ పోవు.

భార్య– ఏంటి, జోకా?

భర్త– జోకు లేదు గీకు లేదు గానీ..జండూ బాం తీసుకురా పో, ఒకటే తలనొప్పి (తల పట్టుకుంటూ)

భార్య– అబ్బ! ఏంటండీ ఎప్పుడూ తల నొప్పి... తలనొప్పి అంటారు. నాకెప్పుడూ తలనొప్పి రానే రాదు!






భర్త– అది తలకాయ ఉన్నోళ్లకే వస్తుందిలే!

భార్య– అంటే?...

భర్త– నీకు తలకాయ ఉంటే అర్థమయ్యేది గానీ, టీవీలో ఏదైనా మాంచి సినిమా పెట్టు! చూద్దాం.

భార్య– మంచి హర్రర్ సినిమా చూద్దామండీ!

భర్త– హర్రర్ సినిమానా? మన పెళ్ళి సి.డిని మించిన హర్రర్ సినిమా ఏముంటది?! ఆ హర్రర్ సినిమా చూసి భరించే ఓపిక నాకు లేదు.

భార్య– అంటే...నేను దెయ్యాన్నా?!

భర్త– ఛ! ఛ!! పెళ్ళాలను ఎవరైనా దెయ్యలతో పోలుస్తారా చెప్పు! దెయ్యాలు ఓ నెలో... సంవత్సరమో పట్టి పీడిస్తాయి. జీవితాంతం పట్టి పీడించే భార్యలకు... అప్పుడప్పుడు పట్టి పీడించి వదిలిపెట్టే దెయ్యాలకు పోలికేంటసలు!!

భార్య– ఏంటండీ! ఏదో స్మెల్ వస్తోంది. మీరు... మీరు...మందు తాగి వచ్చారు కదూ? మీరు మందు తాగుతారని పెళ్ళికి ముందు నాకెందుకు చెప్పలేదు?

భర్త– నువ్వు మాత్రం, షాపింగ్ పేరు మీద నా డబ్బులను మంచినీళ్లకంటే ఘోరంగా పీల్చి పిప్పిచేస్తావని పెళ్ళికి ముందు చెప్పావా? నేను అడ్జెస్ట్ అవ్వట్లేదు?! ఇదీ అంతే! కొన్ని కొన్ని అడ్జెస్ట్ ఐపోవాలి!

భార్య– అసలు... అసలు... తాగడం ఎంత తప్పో తెలుసా మీకు?... తాగితే నరకానికి పోతారు.

భర్త– మరి మందు అమ్మే షాపు వాడు?

భార్య– వాడూ నరకానికే పోతాడు.

భర్త– మరి మందులోకి చికెన్ ముక్కలు అమ్మే రెస్టారెంటు వాడు?

భార్య– వాడూ నరకానికే పోతాడు!

భర్త: మరి నాతో పాటు తాగే నా ఫ్రెండ్స్?


భార్య– మీ ప్రెండ్స్ కూడా నరకానికే పోతారు.

భర్త– తాగే నేను... మందు అమ్మే షాపు వాడు... మంచింగ్‌లోకి చికెన్ అమ్మే రెస్టారెంటు వాడు... కంపెనీ ఇచ్చే నా ఫ్రెండ్స్... ఇంతమంది నరకానికి వెళితే... అది నాకు స్వర్గంతో సమానమే పిచ్చి మొహమా!... ఇంకెక్కడి నరకం?

భార్య– ఛీ ఛీ...మీరు తాగుతారని అస్సలు అనుకోలేదు. నేను మా పుట్టింటికి వెళ్ళిపోతాను.

భర్త– సరేలే వచ్చేటప్పుడు...చికెన్ పికిల్ తీసుకురా! మందులోకి నంజుకోవడానికి బాగుంటది!

భార్య– గాడిద ఎగ్గు తెస్తా! నే వెళ్ళిపోతున్నా.



స్కూల్‌కు వెళ్ళి, మన పిల్లోడిని అటు నుంచి అటే తీసుకెళ్ళి పోతా!

(డయాస్ మీది నుండి దిగి వెళ్ళిపోయింది.)

భర్త– హమ్మయ్య! మందు సిట్టింగ్ వెయ్య డానికి ఏ ఇల్లూ ఖాళీగా లేదండి. మా ఫ్రెండ్స్ తెగ బాధపోడిపోతున్నారు. అప్పుడప్పుడూ ఇట్లా భార్యలు అలిగి పుట్టింటికి వెళితేనే మాకూ బెటర్.

(ఫోన్ తీసి చెవి దగ్గర పెట్టుకొని, డాన్స్ చేస్తూ)

ఆఁ!..రండిరా!... నా భార్య ఊరు వెళ్ళి పోయింది. ఆమె వచ్చేవరకు మా ఇంట్లోనే సిట్టింగ్.

(పాట గట్టిగా పాడుతూ డాన్స్ చేసాడు)

మందు బాబులం... మేము మందు బాబులం... పెళ్లాలు అలిగి వెళ్ళిపోతే... మహా రాజులం...

(డాన్స్ స్టెప్ వేయబోయి, జారి కిందపడి, అరవసాగాడు.)


వామ్మో!...వాయ్యో!...నడుము ఇరిగింది రోవ్... పెళ్ళామా... పెళ్లామా...నా దైవమా... ఎక్కడున్నావే?!!!

(మళ్ళీ పాట మార్చి అదే ట్యూన్‌లో పాడాడు.)

మందు తాగము... మేము మందు తాగము... పెళ్లాలు అలిగి వెళ్ళిపోతే...ఉట్టి మట్టిగడ్డలం...

స్కిట్ అయిపోయింది.

అందరూ చప్పట్లు కొట్టారు.




“మళ్ళీ ఆయన పెళ్ళాం ఏ పర్సో మర్చి పోయిందని ఇంట్లోకి వచ్చి, పతిదేవుడికి సేవ చేసినట్లు ఇంకో సీన్ పెట్టాల్సింది.” అన్నాడు చందు.

“ఆహా! ఇంకా భర్త ఆమె వొళ్ళో తలపెట్టి ఏడ్చినట్లు, మద్యం బాటిల్స్ తీసుకెళ్ళి పారేసి నట్లు ఇవన్నీ పెట్టమనలేదు.” అన్నాడు రామం.

“పెడితే తప్పేంటి?”

“ఒరేయ్! అది సరదా స్కిట్టు రా!... మరీ సీరియస్‌గా ఆలోచించకు. నిజ జీవితంలో ఎన్ని విడాకుల కేసులు చూడడం లేదు నేను!”

“ఇప్పుడు ఒక సాంస్కృతిక గీతానికి, సౌమ్య డాన్స్ చేస్తుంది.” అనౌన్స్ చేసాడు వ్యాఖ్యాత.

“ఒరేయ్! సౌమ్య డాన్సట!” అన్నాడు చందు ఉత్సాహంగా.

సౌమ్య సాంప్రదాయ దుస్తుల్లో వచ్చి, కూచి పూడి నృత్యం చేస్తోంది.

“ఆహా...ఓహో... నయనానందకరం.” అన్నాడు చందు.


అకస్మాత్తుగా చందుకు డౌట్ వచ్చింది.

“ఒరేయ్ రామం!ఆ అమ్మాయిది ఆంధ్ర అని చెప్పావు. మరి ఈ కార్యక్రమంలో సౌమ్య ఎందుకు నాట్యం చేస్తోంది? నిజం చెప్పు! ఈమె ఆంధ్రా అమ్మాయేనా?”


“నీ బొందలా ఉంది డౌట్! పేరుకు తెలం గాణ సంఘం... ఆంధ్రసంఘం... ఆ కుల సంఘం... ఈ కుల సంఘం... అని ఉంటా యిరా! సాంస్కృతిక కార్యక్రమాలు చేసేట ప్పుడు ఇలాంటి కళాకారులు మాత్రం కామన్ గా అన్ని ప్రోగ్రాంస్‌లో ఉంటారు. నాలాంటి కామన్ ప్రేక్షకుడిలాగా!” నవ్వుతూ చెప్పాడు రామం.


“సర్, దయచేసి డాన్స్ చూడండి సార్! డిస్టర్బ్ చేయకండి.” అన్నాడు వాళ్ళ వెనక ఉన్న వాలంటీర్.


“ఏమయ్యా! నాకు తెలీక అడుగుతాను. నువ్వు మా ఇద్దరి వెనకే కాపలా కాస్తావా?” అన్నాడు చందు. **(సశేషం)**





# సెంటర్


క్రీస్తు పూర్వం - క్రీస్తు శకం
కరోనా పూర్వం - కరోనా శకం
సి.ఆర్.రాజు



మందు కొట్టి నడవడం కాదు....
సామాజిక దూరం పాటిస్తూ నడుస్తున్నాడు....
కోవిడ్-19 సామాజిక దూరం
పెండేల



సార్! కొంచం మన ఆఫీసు అడ్రుసు వాట్సప్ చేయండి. ఈ లాక్‌డౌన్ వల్ల దారి మర్చిపోయాను.
గాయత్రి



NEWS
దొంగల భీభత్సం
ఈ మాస్కులు మన పాలిట వరం రా గంగులూ. ఎవరూ గుర్తు పట్టట్లా.
సత్య



ఏంటో ఈ కర్మ! ఇంతకుముందు తుమ్మితే "చిరంజీవ సుఖీభవ" అనేవాళ్ళు. ఇప్పుడు "పక్కక్కెళ్ళరా సచ్చినోడా" అంటున్నారు
శ్రీkar


# స్మైల్స్


ఒరేయ్ పెద్దాడా మోకాలు చిప్పలు
మార్పించాక బాగుందిరా!
ఆ డాక్టర్‌ని అడిగి పాతవి తీసుకో
ఎందుకయినా పనికొస్తాయ్....


ఇదిగో ఏమే...
నా "పిల్లనగ్రోవి"
కనిపించడంలేదు..
నువ్వేమైనా తీశావా?


నేను పక్కనుంటే ఆయన
నవ్వరు గానీ.. మీరు ఫొటో
తీసెయ్యండి!!


మమ్మీ!.. కాఫీకి పాలు కాచిన తర్వాత పోపు పెట్టాలా?..
కాయక ముందా?..


మీరు తీసిన సినిమా-చెత్త సినిమా అంటున్నారు, అందులో
పొడి చెత్త, తడి చెత్త ఏమైనా వుందా సార్?


'లాక్ డౌన్' కదండీ! కొలతలు మారతాయి, తప్పదు!
WARE WAH
TAILORS



# ప్రహేళికా పదబంధం

బుద్ధవరపు కామేశ్వరరావు
98480 47322

**"కౌరవ సంతానంలో 53 వ సోదరుని పేరు ఏమిటి?"**

**ఇదీ, శోభనం రోజున సిగ్గు పడుతూ, పాల గ్లాసుతో గది లోకి వచ్చిన తన భార్య సుపదను ప్రహేళికారావు అడిగిన మొదటి ప్రశ్న.**


**"..................."**

**"పోనీ... ఏ రాజ్యకూటమికీ చెందని ఓ రెండు దేశాల పేర్లు చెప్పు."**

**"................."**

**"సింపుల్ క్వశ్చన్, కాజా అనే స్వీట్ కి ఆ పేరు ఎందుకు వచ్చింది?"**

**"..................."**




అంతే! పాల గ్లాసు పక్కన పెట్టి, ప్రహేళికారావు పాదాల మీద పడిపోయింది సుపద.

అది సాంప్రదాయం ప్రకారం పెట్టిన నమస్కారమో లేక 'నీ క్విజ్ ప్రశ్నలతో నన్ను చంపకురా మగడా... నీకో నమస్కారం' అని కాళ్ళ మీద పడిందో తెలియక అర్థంకాని పజిల్‌లా మొహం పెట్టేడు ప్రహేళికా రావు.

ఏది ఏమైనా... రాబోయే రోజుల్లో సుపదకి క్విజ్‌ల విషయంలో కొంచెం గట్టిగానే ట్రైనింగ్ ఇవ్వాలని ఆ రాత్రే ఓ నిశ్చయానికి వచ్చేసాడు ప్రహేళికా రావు.

✦✦✦

అందరూ అనుకుంటున్నట్టు అతని పేరు ప్రహేళికారావు కాదు. అతని అసలు పేరు ప్రహ్లాదరావు. తన పేరు హిరణ్యకశిపుడు కాక పోయినా, కొడుకుకి మాత్రం ఎంతో భక్తిగా ప్రహ్లాదరావు అని పేరు పెట్టుకున్నాడు పాపం నరసింహం అనే ఆ చాదస్తపు తండ్రి. ఆ పురాణాల ప్రహ్లాదునిది భక్తి పిచ్చి అయితే, మన ప్రహ్లాదరావుది క్విజులు మరియు తిండి పిచ్చి.

పొద్దున్న లేచింది మొదలు పేపర్లు, పత్రికలు క్విజుల కోసం తిరగ వేయడం, తినుబండారాలు కోసం ఫ్రిజులో వెతకడం అతని నిత్యకృత్యం. ఇంట్లో వాళ్లనే కాకుండా, కనపడిన ప్రతీ వాళ్లని తన క్విజులతో... ప్రశ్నలుతో విసిగించడం, సరైన సమాధానాలు చెప్పని వాళ్లని హేళన చేయడం ప్రహ్లాదరావుకి అలవాటుగా మారిపోయింది.

అతని క్విజులుతో విసుగెత్తిపోయిన కొంతమంది మిత్రులు అతన్ని ప్రహ్లాదరావు అని కాకుండా సరదాగా ప్రహేళికారావు అని పిలవడం మొదలెట్టడంతో, ఇదేదో బాగానే ఉంది అని తన పేరును ప్రహేళికా రావుగా మార్చేసుకున్నాడు ప్రహ్లాదరావు.

ఇక పెళ్లి విషయంలో... ప్రహ్లాదరావుకి ఇంకా ఐదేళ్లు నిండకుండానే, అతని తండ్రి నరసింహం అవతారం చాలించేసేడు. పాపం తల్లే కష్టపడి చదివించి ఒక ఉద్యోగస్తుడుని చేసింది.

"ఒరే పెహ్లాదా! ఉద్యోగం వచ్చింది కాబట్టి, త్వరగా ఓ అమ్మాయిని చూసుకుని పెళ్లి చేసే సుకోరా, నీ ప్రశ్నలు పిచ్చి తెలిసిన దగ్గర బంధు వులు ఎవరూ కూడా నీకు పిల్ల నివ్వడానికి ముందుకు రావడం లేదు." కొడుకుని బతిమా లింది ప్రహ్లాదరావు తల్లి.

తల్లి మాట కాదనలేక ఓ సంబధం కోసం తల్లి, మేనమామతో కలసి ఓ పెళ్లి కూతురుని చూడడానికి వెళ్లేడు ప్రహ్లాదరావు.

పెద్దల పలకరింపులు అయిన తరువాత పెళ్లి కూతురుని తీసుకుని రమ్మని పురమాయిం చాడు పిల్ల తండ్రి.

కాసేపటికి పెళ్ళి కూతురు ఓ వెండి పళ్లెంలో మైసూరు పాక్ ముక్కలు తీసుకుని వచ్చి, వాటిని టీపాయ్ మీద పెట్టి, ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది ఎంతో వినయంగా!

ప్లేటులో తినుబండారాలు చూసిన ప్రహ్లాదరావు వాటి మీద దండ యాత్ర చేసి, జెట్ స్పీడులో రెండు ముక్కలు కరకరా నమిలేసి, మూడవ ముక్కను కూడా అదే వేగంతో తినబోయి, అందరూ తెల్లబోయి నోరు ఆవలించి తనవైపే చూడడం గమనించి–

"అవునూ... మైసూరు పాక్ ఇంత గట్టిగా ఉందేమిటీ?... పాకం

బాగా ముదరబెట్టేసారా?" అడిగాడు ప్రహ్లాదరావు, పెళ్లి కూతురు వైపు తిరిగి.

"......................................"

"చెప్పు! అలా సిగ్గు పడతావెందుకు? అసలు శెనగపిండి, పంచదార, నెయ్యి ఏ పాళ్లలో వేసేరు ?"

"................................"

"నాకు అనుమానంగా ఉంది, అసలు ఇది నువ్వు చేసినదేనా?"

"......................................"


"సరే అవన్నీ ఎందుకు కానీ, నీకు వంట చేయడం వచ్చా ? పోనీ అదైనా చెప్పు!"

"వంట అవసరం నాకేంటి? మీరుండగా?" మళ్లీ అదే పెడసరపు జవాబు.

"ఛస్!...వంట చేయడం కూడా రాని ఈ సంబంధం నాకు నచ్చలేదు." కుర్చీలోంచి లేవబోతూ చెప్పాడు ప్రహ్లాదరావు, మేనమామ, తల్లీ అతని వైపు బిక్కచచ్చిపోయి చూస్తూండగా.

"నాకు కూడా..." అంటూ అతని కంటే వేగంగా విసురుగా లేచి, టీపాయ్ మీద ఉన్న మైసూరు పాక్ ముక్కలు ఉన్న వెండి ప్లేటుని ఒక చేత్తో తీసుకుని, రెండో చేత్తో ప్రహ్లాదరావు చేతిలో ఉన్న మైసూరు పాక్ ముక్కని లాక్కుని బుసలు కొడుతూ తన గదిలోకి వెళ్లిపోయింది.

వెర్రి మొహం వేసుకుని, ఆమె వెళ్లిన వైపే చూస్తున్న ప్రహ్లాదరావుని, "ఇంకా ఏం చూస్తావురా, తింగరి సన్యాసి, లేచి తగలడు" అంటూ చెరో జెబ్బా పట్టుకుని బయట ఉన్న ఆటోలో కుదేసారు మేనమామ, తల్లి.




"రాదు!" అంటూ... ఘూ...ర్తి...ఘూ... అది కూడా గదిలో ఉన్న ఫొటోల అద్దాలు బద్దలయ్యేటంత శబ్దంతో చెప్పింది పెళ్లి కూతురు.

ఆ దెబ్బకి ఉలిక్కిపడిన ప్రహ్లాదరావు... కొంచెం తేరుకుని... ఊపిరి పీల్చుకుని–

"వంట చేయడం రాదా? అంటే నేర్చుకోవాలని లేదా? లేక నేర్చుకోవాలనిపించలేదా?" అడిగాడు ఎందుకైనా మంచిదని కొంచెం స్వరం తగ్గించి.

"ఆ రెండూ కాదు. అవసరమనిపించలేదు" అంతే పెడసరంగా చెప్పింది.

"మరి పెళ్లి అయిన తర్వాత వంట విషయం ఏం చేద్దామనుకుంటున్నావ్ ??"

"కేటరింగ్ చేసే వాళ్ళు కూడా ఇంత ఛంఢాలపు ప్రశ్నలు వెయ్యరురా పిచ్చివెధవా!" అంటూ పాపం ప్రహ్లాదరావుని ఇంటికెళ్లేవరకూ ఆటోలో తిట్లతో తల అంటుతూనే ఉన్నారు, అతని తల్లి, మేనమామ.

✦✦✦

ఈ సంఘటన జరిగిన రెండు నెలల వరకూ ప్రహ్లాదరావు వద్ద పెళ్లి గురించి మాట్లాడడానికి ఎవరూ సాహసించలేదు.

రెండు నెలల తరువాత ఓ రోజు, తన పెళ్లి గురించి తల్లి పడుతున్న బాధ చూడలేక ఇంకో అమ్మాయిని చూడడానికి బయలుదేరాడు ప్రహ్లాదరావు కిందటి సారిలాగే, తన తల్లినీ, మేనమామను వెంట బెట్టుకుని.

కొడుకు గత చరిత్ర తెలిసిన తల్లి కాబట్టి "పెళ్లికూతురిని ఎటువంటి ప్రశ్నలు వేసి వేధించకూడదని" అతని చేత ముందే ఒట్టు వేయించుకుంది.

ప్రహ్లాదరావు అండ్ పార్టీ కుర్చీలలో ఆశీనులయ్యాక–"బాబూ! మీ పూర్తి పేరు ఏమిటి?" అడిగాడు పెళ్లి కూతురు తండ్రి ప్రహ్లాదరావును.

"నా పేరు ప్రహ్లాదరావండీ, కొంతమంది స్నేహితులు ప్రహేళికారావు అని కూడా పిలుస్తారు. మరి మీ పేరు?"

"నా పేరు సంగమేశ్వరరావు బాబూ!"

"సంగమేశ్వర ఆలయం ఎక్కడుందో తెలుసాండీ?"

"తెలవదు బాబూ!"

"పోనీ తెలుసుకోవాలని కూడా అనిపించలేదాండీ!?"

"అవసరం లేదనిపించింది బాబూ!"

అప్పటికే ప్రహ్లాదరావు ఎడంకాలు మీద రెండుసార్లు తొక్కింది అతని తల్లి... కంట్రోల్




చేసుకో అని, సింబాలిక్‌గా.

అది గ్రహించిన ప్రహ్లాదరావు ఇద్దరి మధ్య కుక్కిన పేనులా కూర్చున్నాడు సోఫాలో.

ఇవేమీ తెలియని అమ్మాయి తండ్రి,

"అమ్మా! మా తుషారని తీసుకుని రమ్మంటారా ?" అని అడిగాడు ప్రహ్లాదరావు తల్లిని.

"అయితే పెళ్లి కూతురు పేరు తుషారా?" మళ్లీ బరిలోకి దిగిపోయాడు ప్రహ్లాదరావు.

"ఔను బాబూ! ఏం పేరు నచ్చలేదా?"

"అది కాదండీ... తుషార అంటే అర్థం తెలుసా?"

"తెలియదు బాబూ!... పేరు బావుందని పెట్టేసాం."

"అయ్యో! అలాగా! తుషార అంటే మంచు అని అర్థం అండీ. పోనీ, మన దేశానికి మంచు పర్వతాలు ఏ దిక్కున ఉన్నాయో తెలుసా ?"

"అంత నాలెడ్జ్ నాకు లేదు బాబూ!"

"తూర్పు వైపు ఉన్నాయండీ... పోనీ మీ ఇంటికి తూర్పు వైపు ఏదో అదైనా తెలుసా?" కొంచెం వెటకారం జోడించి అడిగాడు ప్రహ్లాదరావు.

"తెలియదు బాబూ! కొంచెం మీరే చెప్పి పుణ్యం కట్టుకోండి." అంతే వెటకారంగా చెప్పేడు అమ్మాయి తండ్రి.

ఒక్క సెకను ఆలోచించి... "అదిగో! అదే మేము లోపలికి వచ్చిన గుమ్మం వైపు ఉన్నదే తూర్పు." వేలెత్తి చూపుతూ చెప్పాడు ప్రహ్లాదరావు.

వెంటనే ప్రహ్లాదరావు తల్లీ, మేనమామ ఒకేసారి కళ్లతో సౌంజ్ఞలు చేసుకుని కాళ్లు సాపు చేసుకుని డ్యూటీలోకి దిగబోయేరు.

ఈ లోగా...

"ఒహో! తూర్పు వైపు అంటే అదా!... లే బాబూ లేచి వచ్చిన దోవనే మర్యాదగా వెళ్లు! ఆలశ్యమయితే నేను మనిషిని కాదు. మొగుడు కావలసింది మా అమ్మాయికి, నాకు కాదు." అంటూ అమ్మాయి తండ్రి ప్రహ్లాదరావుని పెడ రెక్కలు పట్టుకుని లేపబోయేడు.

అతనికి ఆ అవకాశం ఇవ్వకుండా ప్రహ్లాదరావుని అతని తల్లి, మేనమామ చెరో జబ్బా పట్టుకుని ఎప్పటిలాగే ఆటోలో కుదేసి, ఇంటికి తీసుకుని పోయారు. ఎప్పటిలాగే దోవ పొడుగునా తిట్లతో తలంటుతూ..


✦✦✦

ఇది జరిగిన చాలా రోజుల తరువాత, ప్రహ్లాదరావు తల్లి కోరిక మేరకు, మేరేజ్ మేట్రిమోనీలలో అతని పేరు నమోదు చేయించారు అతని స్నేహితులు. అభిరుచులు కాలమ్‌లో పజిల్స్ మరియు వంటలు అనేవి రాకుండా జాగ్రత్తపడి.

అప్పటికే పెళ్లి చూపులు విషయంలో చావు దెబ్బలు తిన్న ప్రహ్లాదరావు కూడా కిక్కురుమన కుండా ఈ ప్రపోజల్‌కి ఒప్పేసుకున్నాడు.

✦✦✦

మేరేజ్ మేట్రిమోనీలలో తెగ వెతికి వెతికి, తన పేరుకు మేచ్ అయ్యింది కదా అని వెనకా ముందూ ఏమీ చూసుకోకుండా, గత అనుభవాల దృష్ట్యా, పెళ్లిచూపులు లేకుండా, సుపదను సెలెక్ట్ చేసుకొని, వివాహం చేసేసుకున్నాడు ప్రహేళికారావు. అంతేకాదు తమ ఇద్దరి పేర్లూ కలసి వచ్చేలా, పెళ్లి పత్రిక మీద 'ప్రహేళికా (సు) పదబంధం' అని ఎంతో గొప్పగా వేయించుకున్నాడు ప్రహేళికారావు.



ఇప్పుడిప్పుడే తెలుస్తోంది ప్రహేళికారావుకి, సుపదకి జనరల్ నాలెడ్జ్ తక్కువనీ, కొన్ని రోజులు ట్రైనింగ్ ఇచ్చి తోవలో పెట్టాలనీ, అప్పుడు కానీ తను, సుపద కలసి తన చిరకాలవాంఛ అయిన, "మీలో ఎవరు కోటీశ్వరుడు" క్విజ్‌లో పాల్గొని ప్రైజు మనీ కోటి రూపాయలు కొట్టుకు రాలేమనీ.

✦✦✦

ఆరు నెలలు గిర్రున తిరిగాయి. సుపద క్విజ్‌లలో ఏమాత్రం పరిణితి సాధించ లేదు, సరికదా, ప్రహేళికారావు అడిగే ప్రశ్నలకు కొంచెం వెటకారంగా సమాధానాలు ఇవ్వడం నేర్చుకుంది. పోనీ ఈ విధంగానైనా తనని హింసించడం మానేస్తాడేమోనని.

కాని పట్టు వదలని విక్రమార్కుడులా తన ప్రయత్నాలు మానలేదు ప్రహేళికా రావు.

✦✦✦

ఇక, ఈయన తనని ప్రశ్నలతో వేధించడం మానడు అని ఓ స్థిర నిశ్చయానికి వచ్చిన సుపద, ఈ గండం నుంచి గట్టెక్కేందుకు ఏదైనా ఉపాయం చెప్పమని తన అక్కకి ఫోన్ చేసింది ఓ రోజు.

దానికి ఆవిడ 'ముల్లును ముల్లు తోనే తీయాలని, అలాగే నువ్వు కూడా అతడిని తికమక ప్రశ్నలతోనే లొంగదీసు కోవాలని" సలహా ఇచ్చింది.

అదిగో, అప్పటినుండి అతడిని ఎలా ఉక్కిరిబిక్కిరి చెయ్యాలా అని ఆలోచిస్తోంది సుపద. అనుకోకుండా ఆ రోజు రానే వచ్చింది.


✦✦✦

స్వతహాగా తిండి పురుషుడైన ప్రహేళికారావు, ఉదయం టిఫిన్ తిని, ఆఫీసుకు వెళ్లి, మధ్యాహ్నం భోజనానికి మటుకు ఇంటికి వచ్చేస్తుంటాడు. ఆఫీసులో తింటే, సాటి ఉద్యోగులు వాటాకి వచ్చేస్తారని అతని భయం. అంతేకాదు, ప్రతీరోజూ ఆఫీసుకు వెళ్లే ముందు భార్యని అడుగుతాడు– "మధ్యాహ్నం భోజనంలోకి స్పెషల్ ఏమిటని ?" ఎందుకంటే, ఆ స్పెషల్ ఐటంస్ కోసం, ఆఫీసులో నానా గడ్డి తినకుండా కడుపుని ఖాళీగా ఉంచుకోవడం కోసం.

ఆ రోజు...

ఆఫీసు ఇన్‌స్పెక్షన్ హడావుడిలో పడి, మధ్యాహ్న భోజనం వివరాలు అడక్కుండా, ఆఫీసుకి వెళ్లి పోయి, ఆ తరువాత జ్ఞాపకం వచ్చి, ఎంతో ఆశతో వంటకాలను ఊహించుకుంటూ భార్యకు ఫోన్ చేసేడు ప్రహేళికారావు.




ఇలాంటి సమయం కోసమే ఎదురు చూస్తున్న సుపద ఫోన్ ఎత్తింది. తను అమలు చేయబోయే పథకాన్ని ఓసారి మననం చేసుకుంటూ...

"సుపదా! ఈ రోజు ఏం కూర చేసేవ్?" అడిగాడు ప్రహేళికారావు, ఎంతో ఆశగా !!


"ఆశ, దోశ, అప్పడమేం కదూ, చెప్తారు పాపం. మీరే ఊహించుకోండి." అతని ఆశను నీరు గార్చేసింది సుపద.

"రైతు బజారులో కొన్న కూరలా??"

"మన పెరట్లో పండించినవే !!"

"ఇక ఊరించక, ఏం కూర వండేవో చెప్పేయవోయ్."




"వచ్చేదాకా చెప్పను! అది ఏం కూరో... అంతా సస్పెన్స్!"

కనీసం రుచి ఎలా ఉంటుందో అదైనా చెప్ప వోయ్ ?"

"సూపరుగా యమ్మీ యమ్మీగా ఉంటుంది."

"చెబుతోంటేనే నోరు ఊరిపోతోంది. మరి తింటే ఇంక ఎలా ఉంటుందో?"

"తిన్న తర్వాత కూడా అలాగే అంటారు."

"బాగానే వుంది కానీ, కొంచెం ఏదైనా క్లూ ఇవ్వవోయ్! ఆ రహస్య కూర ఏదో తేల్చేస్తాను."

"సరే అయితే ఆ రహస్యం చెప్పేస్తున్నా. జాగ్రత్తగా వినండి. నేనిచ్చిన సమాధానాల్లోనే అది దాగి ఉంది. ఇటువంటి పజిల్స్ సాల్వ్ చేయడంలో మీరు అనుభవజ్ఞులు కదా? చాలా ఈజీగా కనిపెట్టేస్తారులెండి. ఓ పావు గంటలో ఏ విషయం ఫోన్ చేయండేం!" కొంచెం వెట కారం జోడించి చెప్పింది సుపథ.

✦✦✦

తను ఏం ప్రశ్నలు అడిగాడో, వాటికి సుపద ఏం సమాధానాలు ఇచ్చిందో గుర్తుకు తెచ్చు కోవడానికి తెగ తంటాలు పడుతున్నాడు ప్రహే ళికారావు. ఎంత గింజుకుంటున్నా ఏవీ జ్ఞాపకం రాక బుర్రని బరబరా గోకేసుకుం టున్న ప్రహేళికారావు వద్దకు అతని సహ చరుడు సలహాల్రావు వచ్చి–"ఏంటోయ్! బుర్రని అలా రక్తాలు కారేలా గోకేసుకుంటు న్నావు? తలలో పేలు ఏమైనా డిస్కో డాన్స్ కడుతున్నాయా ? లేక జనాలను చంపడానికి ఏదైనా కొత్త క్విజ్ ప్లాన్ చేస్తున్నావా ?" అని అడగడంతో–"చచ్చిన పాముని మళ్లీ చంప కురా! నేను ఎప్పుడైనా తెలిసో, తెలియకో నిన్ను కూడా క్విజులతో వేధించి, అవమాన పరిచి ఉంటే నన్ను మనస్ఫూర్తిగా క్షమించే యిరా!" అంటూ సలహాల్రావు చేతులు పట్టు కుని బాధగా మూలిగాడు ప్రహేళికారావు.




ఇలాంటి చర్యని ప్రహేళికారావు నుంచి ఊహించని సలహాల్రావు ఆశ్చర్యంతో,

"ఇదేవిట్రోయ్, ఇది కూడా ఏదైనా కొత్త రకం క్విజ్‌లో భాగమా ??" అని అడిగాడు.

"లేదురా! ఇంక ఎవ్వరినీ ఎలాంటి పజిల్స్ లేదా క్విజ్ సంబంధించిన ప్రశ్నలు వేసి బాధ పెట్టకూడదు అని నిశ్చయించుకున్నానురా. ఎందుకంటే కేవలం ఓ పది నిమిషాల క్రితం జరిగిన సంభాషణే నాకు గుర్తు లేనప్పుడు ఎప్పుడో చదివిన పాత సంఘటనలు ఎవరికీ మాత్రం గుర్తుంటాయి?" అంటూ తనకు, సుపదకి జరిగిన కూర గురించి జరిగిన సంభా షణ అంతా పూస గుచ్చినట్టు చెప్పి, బావురు మన్నాడు ప్రహేళికారావు.

"బాగుందిరా, బుద్ధుడుకి భోధి చెట్టుకింద జ్ఞానోదయం అయినట్టు, నీకు సుపద బెట్టు వల్ల జ్ఞానోదయం అయ్యిందన్న మాట. అది సరే, ఫోన్‌లో జరిగిన సంభాషణలు గురించి నువ్వు ఇంత బాధ పడుతున్నావు గానీ, నీ

స్మార్ట్ ఫోన్‌లో ఆటోమేటిక్ కాల్ రికార్డింగ్ ఆప్షన్ ఉంది కదా? అది ఓపెన్ చేసి ఆ సంభాషణలు వినొచ్చుగా?"

వెంటనే కార్యరంగంలోకి దిగిన ప్రహేళికారావు, ఫోన్‌లో వింటూ అన్నీ ఓ కాగితం మీద రాయడం మొదలెట్టాడు.

ఏ విధంగా చూసినా, ఎన్ని విధాలుగా రాసిన ఆ సంభాషణలలోని రహస్యాన్ని కనుక్కోలేక పోయాడు ప్రహేళికారావు.

ఇక ఓపికలేక భార్యకు ఫోన్ చేసి– "సుపదా! ఆఫీసులో పని ఎక్కువగా ఉంది. నా కోసం చూడకు. భోజనం చేసేయ్!" అని ఓ అబద్ధం చెప్పి, తాత్కాలికంగా ఈ గండం నుంచి బయటపడి, ఆఫీసు కేంటీనులో దూరేడు ప్రహేళికారావు.




ఇలాంటి సమాధానం వస్తుందని ముందే ఊహించిన సుపద ఎగిరి గంతేసింది, తన విజయానికి మొదటి మెట్టుగా!

✦✦✦

"సుపదా! ఆకలేస్తోంది, త్వరగా భోజనం వడ్డించేయవోయ్! స్నానం చేసేసి వస్తా!" అంటూ వాష్‌రూమ్‌లోకి దూరేడు, ఆఫీసు నుంచి ఆలశ్యంగా వచ్చిన ప్రహేళికారావు.

ఎప్పుడూ ఆఫీసు నుంచి వచ్చీరావడంతోనే యక్ష ప్రశ్నల్లాంటి లక్ష ప్రశ్నలతో బుర్ర తినేసే భర్త మౌనంగా ఉండడంతో, తన పాచిక పారిందని సంతోషపడింది సుపద.

ఆనపకాయ కూర తింటున్న ప్రహేళికారావు మొహంలో అవమానంతో కూడిన అనుమానంతో నిండిన అభద్రతా భావం కనపడడంతో, ఇక ఉదయం జరిగిన సంభాషణ గురించి చర్చించి, అతడిని బాధపెట్టకూడదని నిశ్చయించుకున్న సుపద, వేరే విషయాల గురించి చర్చించడం మొదలుపెట్టింది. అనవసర ప్రసంగం చేయకుండా త్వరగా భోజన కార్యక్రమం ముగించి బయటపడ్డాడు.

✦✦✦

ఆ మరుసటి రోజు సాయంత్రం...

"అక్కా! నువ్వు చెప్పినట్లుగానే, ముళ్లుని ముళ్లుతోనే తీసేనే. ఈ దెబ్బకి మళ్లీ ఆయన నా దగ్గర క్విజ్ ప్రోగ్రామ్‌లు పెట్టకుండా చేసా!" ఫోన్‌లో చెబుతోంది సుపద.


"దొంగ పీనుగా! ఏం మాయ చేసావే? పూర్తిగా చెప్పు." ఆశ్చర్యంగా అడిగింది.

జరిగిన సంఘటన అంతా మొత్తం పూస గుచ్చినట్టు అక్కకు చెప్పింది సుపద.

"ఏడిసావులే! మరిది గారు అన్నారని కాదు కానీ, ఇన్ని తెలివి తేటలు ఉన్న నువ్వు, మరిది గారి మాట విని కొంచెం లోకజ్ఞానం పెంచుకొని, మీరిద్దరూ కలిసి ఆ మీలో ఎవరు కోటీశ్వరుడు ప్రోగ్రామ్‌కు వెళితే ఆ ప్రైజు మనీ మీరే కొట్టుకొచ్చేస్తారని నేను గ్యారెంటీగా చెప్పగలను." అంటూ చెల్లెలుకి హితబోధ చేసింది.

"పాపం! నిన్న ఆయన పరిస్థితి చూసిన తరువాత నాకూ అలాగే అనిపించింది. అనవసరంగా ఆయనని బాధపెట్టేనేమోనని! కానీ ఈ దెబ్బతో ఇక ఆయన ఎవరినీ ఇలాంటి క్విజులతో బాధపెట్టడంకానీ, హేళన చేయడం కానీ చెయ్యరనే తృప్తి మటుకు నాకు కలిగింది! ఉంటానక్కా! థాంక్స్!" అంటూ ఫోన్ పెట్టేసి, బుక్ రేక్ వద్దకు వెళ్లి– పజిల్స్... పదబంధాలు అనే పుస్తకం తీసుకుని చదవడం మొదలు పెట్టింది సుపద.

అప్పుడే గుమ్మంలోకి అడుగు పెట్టిన ప్రహేళికారావు ఆమెనూ, ఆమె చేతిలోని పుస్తకాన్ని బిక్క చచ్చిపోయి చూస్తుండిపోయాడు.



# ఆనందరావ్వా-ఏటిఎం




డాక్టర్ చివుకుల పద్మజ-

9949979660


**ఉదయం ఐదు గంటలు. ప్లాస్టిక్ కవర్ చేత బుచ్చుకుని ఇంటి గేట్ దగ్గరికి వచ్చాడు ఆనందరావు.**

**భార్య వరలక్ష్మి గేట్ బయట వాకిట్లో ముగ్గేస్తోంది.**

**"ఇదిగో, అంతంత ముగ్గులెయ్యకు. చిన్నవి వెయ్యి. వారాని కల్లా ముగ్గు ఐపోయిందంటావు. పైగా చీకటితోనే వేస్తావు. లైటు దండగ. ఎండెక్కాక వెయ్యమంటే వినేదవ్వు" చిరాకుగా తిడుతూ మార్నింగ్ వాక్‌కి బయలుదేరాడు.**




కులాసాగా అన్ని వీధుల్లో వాకింగ్ చేసి, పూలున్న చెట్టు కనిపించటం ఆలస్యం, అన్నీ కోసేసి కవర్‌లో వేసుకుని కాలనీ చివర పార్క్‌కి చేరాడు.

పార్క్‌లో వాకింగ్ చేస్తున్న పరమేశం– "హలో ఆనందరావు గారూ!... పూలు కోసుకున్నారా?" ఎకెసెక్కంగా పలకరించాడు.

"ఏం పూలండీ?! నా బొంద. అంతా తెలివి మీరిపోయారు. అర్ధరాత్రే కోసేసుకుంటున్నట్లున్నారు... కాసిన్ని కోసుకున్నా అంతే!"

చుట్టుపక్కల వీధుల వాళ్లంతా ముందు రోజు మొగ్గలే కోసేస్తున్నారు. లేకపోతే ఒక్క పువ్వు కూడా వదలడు. చెట్టున్న వాళ్ళు, పూల ముఖం కూడా చూడలేకపోయారు చాలా ఏళ్ళు ఆనందరావు దెబ్బకి.

వేప చెట్టు పుల్ల విరిచి దంతధావనం కానిచ్చి, పార్క్ పంపు నీళ్లతోనే ముఖం కడిగి ఇంటికి బయలుదేరాడు.

గేట్ తీస్తూ నేమ్ బోర్డు చూసాడు. సన్నారి ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్... అనే బోర్డు మీద ముందు 'పి' రాసి, 'న' వత్తు కొట్టేసి వుంది. అది కాస్త అప్పుడు 'పిసనారి ఆనందరావు' అయింది.

మండిపడుతూ ఇంట్లో కొచ్చి "వెధవలు వెధవలని, కాస్త డబ్బు దాచుకుంటే చూసి చావలేరు పింజారి వెధవలు!" తిడుతూనే పాల ప్యాకెట్, పూలు భార్య చేతికిచ్చాడు.

"అమ్మయ్యా! కాఫీకి లేట్ అయిందని చూస్తున్నా! ఇక ఇవ్వండి సామానులు త్వరగా" అంది వరలక్ష్మి వంటింట్లో కెళ్తూ.

ఆనందరావు షెల్ఫ్ తాళం తీసి కావాల్సినంత కాఫీ పొడి, పిల్లలకి హార్లిక్స్ తీసి భార్య చేతికిచ్చాడు.

"ఇదిగో, వంట సామాన్లు. ఇవ్వాళ సొరకాయ పప్పు చేసి, టమాటో చారు పెట్టు" అని పావు సొరకాయ ముక్క, నాలుగు టమేటాలు, కందిపప్పు వగైరా సరుకులు వరలక్ష్మికి ఇచ్చి చెప్పాడు.

ఆ పింజారి వెధవలెవరో బయట బోర్డు మీద రాసినట్లు, ఆనందరావు బహు పిసనారి. పైసా ఖర్చు పెట్టాలంటే పదహారు సార్లు ఆలోచించే రకం. రోజు వంటకు సరిపడా మాత్రమే ఇస్తాడు భార్యకు. సరుకులు, కూరగాయలు సమస్తం అతని ఆధీనంలోనే ఉంటాయి. కావలిసినంత ఇచ్చి షెల్ఫ్‌కు తాళం వేసుకుంటాడు. భార్య ఎక్కడ దుబారా చేస్తుందో అని భయం.

అదేమి విచిత్రమో, ఆనందరావు ఇచ్చే అన్నీ సరుకులు వంటకు సరిగ్గా సరిపోతాయి. ఎక్కువా కావు, తక్కువా కావు. ఆశ్చర్యపోతూంటుంది వరలక్ష్మి ఆనందరావు టాలెంట్‌కి.

తండ్రి ఇచ్చిపోయిన ఇల్లు, ఒక పోర్షనులో ఆనందరావు కుటుంబం ఉంటుంది. మిగిలిన రెండు పోర్షన్లు అద్దెకిచ్చి టంచనుగా అద్దె వసూలు చేస్తుంటాడు.

"మా నాన్న కాస్త పెద్ద ప్లేస్ అన్నా కొన్నాడు కాదు. చుట్టూ స్థలం ఉంటే బోలెడు కూర గాయలు పండించచ్చు. ఖర్చు తప్పేది" కూరలు కొనాలనప్పుడల్లా ఒక అష్టోత్తరం చదువుతాడు.

కూరగాయలు ఇంటిదగ్గర కొనడు, రేట్ ఎక్కువని. తెల్లవారుఝామునే పెద్ద మార్కెట్‌కి వెళ్తాడు. అక్కడ రైతులు ట్రక్కుల్లో తెస్తారు కూరగాయలు, ఆకుకూరలు. చవగ్గా వచ్చే కూరలు తప్ప వేరేవి కొనడు. ఆకుకూరలైతే పుష్కలంగా తెస్తాడు. పది రూపాయలకి పది కట్టలు ఇస్తారు రైతులు హోల్‌సేల్‌గా. అక్కడ కొంతమందికి ఆనందరావు సుపరిచితమే. ఆ తర్వాత మూడు నాలుగు రోజులు ఆకుకూర వంటలే. పిల్లలు భయపడి పోతారు ఆకుకూర అనగానే.

"అమ్మా, బిర్యానీలు , శాండ్విచ్‌లు తెస్తారమ్మా మా ఫ్రెండ్స్ అంతా. నువు అవి చెయ్యవే" గొడవ చేస్తారు పిల్లలిద్దరూ. రేట్ ఎక్కువ ఉంటాయి అని బీన్స్, కాప్సికం, క్యారెట్ లాంటివి తేడు.


"అవి వేస్ట్ రా! అంతకు మించి ఆకుకూరల్లో పోషకాలు ఉంటాయి" పిల్లల నోరు మూస్తాడు.

ఇలాంటి పనులన్నింటికీ సైకిల్ మీదే వెళ్తాడు. ఆఫీస్‌కైతే మటుకు సగం దూరం నడిచి, మిగిలిన సగం షేర్ ఆటో ఎక్కుతాడు.

ఇంటికి కావాల్సిన సరుకులు టోకున ఒక సంవత్సరానికి సరిపడా కొంటాడు పెద్ద బజార్‌లో. మొత్తం మీద విడిగా కొన్నదానికి, ఇలా ఒకేసారి కొన్నదానికి చాలానే తేడా ఉంటుంది. కాకపోతే వాటన్నిటిని మేడ మీద ఎండపోసి బాగుచేసే డ్యూటీ వరలక్ష్మిది.

పెద్ద బజార్ కాక ఆనందరావుకి ఇష్టమైన షాపింగ్ ప్లేస్ మరొకటి ఉందండోయ్. అదే మాయాబజార్. అంటే దొంగ వస్తువులు, కస్టమ్స్ కట్టకుండా తెచ్చిన ఐటమ్స్ అమ్మే ప్లేస్. ఇంటికి కావాల్సిన ఫ్యాన్‌ల్లాంటి వస్తువులు గాని, వాచీలు గాని అక్కడే కొంటాడు. చాలా చీప్‌గా వస్తాయి. పిల్లలకి, తనకు రెడీమేడ్ బట్టలు, చివరికి వరలక్ష్మికి చీరలు కూడా అక్కడే కొంటాడు. అసలు కొనడం చాలా అరుదు గాని, కొంటే మటుకు ఇక్కడే కొంటాడు.

పిల్లలకి ఏమన్నా జ్వరాలు, జలుబులు వస్తే హాస్పిటల్‌కి




తీసుకెళ్ళడు. ఇంటి దగ్గర గవర్నమెంట్ హోమియో క్లినిక్ వుంది. ఇంటిల్లి పాదికి వైద్యం అక్కడే. అక్కడయితే పెద్దగా జనాలు వుండరు, ఖర్చు ఉండదు.


పిల్లలని మళ్ళీ గవర్నమెంట్ స్కూల్ కాకుండా ఇంటి దగ్గరి ఒక మాదిరి ప్రైవేట్ స్కూల్‌లో వేసాడు. వరలక్ష్మి అదే అడిగింది పిల్లలని చేర్చినప్పుడు.

"పిచ్చిమొహమా! ఇలాంటప్పుడు డబ్బు చూసుకోకూడదే. గవర్నమెంట్ స్కూల్ మనకి దూరంలో వుంది. రోజూ తోడు వెళ్లి తేవాలి, నాకా ఆఫీస్‌తో కుదరదు. నీకా ఇంట్లో పని, అదీ కాక వాళ్ళని కాస్త బాగా చదువుకోనీ" ఉపదేశించాడు.

పిల్లల చదువు మీద కాస్త శ్రద్ధ కాబట్టి ఊరుకున్నాడు కానీ, లేకపోతే గవర్నమెంట్ స్కూల్‌లో మిడ్ డే మీల్స్ వదిలేవాడా... అనుకుంది వరలక్ష్మి. అయితే స్కూల్ ఫీజులు మాత్రం బాగా లేట్‌గా కడతాడు.

✦✦✦

పొద్దున్నే ఆరు గంటలకల్లా సరుకుల కోసం పెద్ద సంచులు తీసుకుని ముందు ఏటిఎంకి వెళ్ళాడు.










"ప్లీజ్ ఇన్సర్ట్ యువర్ కార్డు" అని గొంతు వినిపిస్తోంది. కార్డు పెట్టి మొదట పదివేలు కొట్టాడు. ఆశ్చర్యంగా డబ్బులు వరుసగా వస్తూనే వున్నాయి. పదిసార్లు, పది పదివేలు, లక్ష... ఏం అర్థం కాలేదు ఆనందరావుకి.

"మీరు లక్ష రూపాయలు డ్రా చేసారు. ఇవి దాన ధర్మాలు చెయ్యాలి. ఎవరికి ఎంత అవసరమో అడిగి అంతే ఒక్కసారే ఇవ్వాలి. బాగ్‌లో చేయి పెడితే వచ్చినంతే ఇవ్వాలి. పారేయకూడదు, దాచుకోకూడదు, ఏమి కొనకూడదు. స్వంతానికి వాడకూడదు. సాయంత్రం ఆరు గంటలలోపు డబ్బు అయిపోతే, మీ బ్యాంకు బాలన్స్ డబుల్ అవుతుంది, ఐపోక పోతే జీరో అవుతుంది" ఎటిఎంలోంచి వినిపించింది.

అదిరిపడ్డాడు ఆనందరావు.

నమ్మబుద్ధి కాలేదు. చేతిలో చూస్తే నిజంగానే లక్ష వున్నాయి. భ్రమ అనుకోటానికి లేదు. చెవులారా విన్నాడు. చుట్టూ చూసాడు. ఎవరూ లేరు. అక్కడే మెట్లమీద కూలబడి ఆలోచించాడు. సరే ఇదేంటో చూద్దాం. డబ్బు దాచాలంటే కష్టం కానీ, దానం చెయ్యాలంటే ఎంతసేపు. అంతా అయిపోతే, బ్యాంకులో పది లక్షలు వుంది, అవి కాస్తా ఇరవై లక్షలు అవుతాయి. ఆనందంతో తలమునకలయ్యాడు.

ఇక్కడినుంచే మొదలు పెడదాం అని చుట్టూ చూసాడు. పక్కన ఒక బిచ్చగాడు ఉంటాడు, ఎప్పుడూ ధర్మం ధర్మం అని ప్రాణం తీస్తుంటాడు. వెళ్లి పడుకున్న బిచ్చగాడ్ని లేపాడు.




"నీకు డబ్బులు అవసరమా.. ఎంత ఇవ్వమంటావ్?" అడిగాడు.

బిచ్చగాడు అయోమయంగా చూసాడు. వందసార్లడిగినా ఎవరూ ఇవ్వరు. ఈయనేంటి లేపి మరీ అడుగుతున్నాడు అనుకుని "పది రూపాయలియ్యండయ్యా! టీ తాగుతాను!!" అన్నాడు.

పది రూపాయలా... వీడి మొహం మండ. కాస్త ఎక్కువ అడక్కూడదూ.. తిట్టుకుంటూ పది రూపాయలిచ్చి బయటపడ్డాడు.

తర్వాత ఎక్కడికా అని ఆలోచిస్తుంటే గత వారం గుడికి వెళ్ళినప్పుడు అక్కడ పూజారి తన కూతురి పెళ్లి అని ఎవరికి తోచినంత వారివ్వమని అడగటం గుర్తు వచ్చింది.

'అమ్మయ్య! పెళ్లి అంటే చాలా అడుగుతారు. డబ్బులు దెబ్బకి అయిపోతాయి' అని ఆనందంగా గుడి కేసి దారితీసాడు.

తీరా గుళ్లో ఎప్పుడూ వుండే పూజారి కాకుండా ఇంకొక పూజారి పూజ చేసేందుకు సిద్ధం అవుతున్నాడు.

"స్వామీ! పూజారి గారు..." గొణిగాడు ఆనందరావు.

తమలపాకులు శుభ్రం చేసుకుంటూ "వారి అమ్మాయి పెళ్లి అన్నవరంలో. అందుకే ఇక్కడ చెయ్యమని నాకు అప్పగించారు" చెప్పాడతను.

ఓరినీ డేట్ తెలుసుకోలేకపోతినే అయ్యో.. మంచి ఛాన్స్ పోయిందే. అనుకుంటూ పోనీ కనీసం ఈయన్నే అడుగుదాం అని– "స్వామీ, మీకేమన్నా డబ్బు అవసరమా?" అడిగాడు.

ఈయనేదో ధర్మకర్త అయ్యుంటాడు. తనను పరీక్షించటానికి అడుగుతున్నాడు అనుకుని–


"అవసరం లేదండి. అన్నిటికి మాకు ఆ దేవుడే వున్నాడు" చెప్పి బావి దగ్గరికి వెళ్ళి పోయాడు.

ఉస్సురంటూ బయటకి వచ్చాడు ఆనంద రావు. అక్కడ కూర్చున్న ఇద్దరి బిచ్చగాళ్లకన్నా ఇద్దాం అని బాగ్‌లో చెయ్యి పెట్టాడు. ఐదు వందలు వచ్చింది. ఒకళ్ళకి ఇచ్చాడు. ఆ బిచ్చ గాడు అదిరిపోయి పైకి కిందికి చూస్తున్నాడు. ఆనందరావు ఇంకా అక్కడే నిలబడడం చూసి "చిల్లర ఇవ్వమంటారా బాబయ్యా" అన్నాడు. నాకే ఎట్లా ఖర్చు కావాలిరా అని చూస్తుంటే నాకు చిల్లర కుడా ఇస్తావా? తిట్టుకుంటూ–

"వద్దు. మొత్తం నీకే!!" అన్నాడు.

అది చూసిన పక్కన బిచ్చగత్తె "నాకూ ఐదు వందలియ్యండి బాబయ్యా! పిల్లలున్నారు" అంటూ ఆత్రంగా ఎదురు వచ్చింది.

ఓసినీ.. నీకు ఇంతేనా! ఎక్కువ అడక్కూడ దుటే.. సణుక్కుంటూ ఐదు వందలు ఇచ్చి రోడ్ మీదకి వచ్చాడు.. ఛీ.. ఛీ.. ఒక్కడు కూడా లక్ష రూపాయలు అడగడు.. పోనీ తానే ఎక్కువ తీసి ఇద్దామా అంటే తనేమో మొదలే పిసినారి కనుక చేతికి ఎక్కువ డబ్బులు రావు. నడుస్తూ వస్తుంటే రైలు పట్టాల పక్కన గుడిసెలు కనిపిం చాయి. అమ్మయ్యా.. వీళ్లకు డబ్బు అవసరం ఉంటుంది. పరిగెత్తుకుంటూ అక్కడికి వెళ్ళాడు.




ఒక గుడిసె ముందు ఒక ముసలామె మంచం మీద కూర్చుని వుంది.

ఆనందరావు ఆమె దగ్గరికి పోయి "అవ్వా, అవ్వా.. పెద్దదానివి.. నీకేమైనా రోగముందా? చెప్పు. నేను డబ్బులు ఇస్తాను ఎంత కావా లన్నా" అన్నాడు.

ఆమె చటుక్కున "ఒరేయ్ మల్లేసు, ఓబు లేసు.. రండిరా.. వీడెవడో నాకు రోగం, గీగం అని పిచ్చి పిచ్చి గా వాగుతున్నాడు" అరిచింది గుడిసెల్లోకి చూస్తూ.

ఆమె అరుపులు విని నలుగురు కర్రలతో బయటికి వచ్చారు "ఎవడ్రా అది?"

ఆనందరావుకి ముచ్చెమటలు పోశాయి.




వామ్మో వీళ్లొచ్చి మీద పడితే ఎముకల్లో సున్నం ఉండదు అని కాలికి బుద్ధి చెప్పి పరిగెత్తాడు.

తేరుకుని చూస్తే మార్కెట్ దగ్గర ఉన్నట్టు అర్థం అయింది. ఆలోచించాడు... తాను ఎప్పుడు కూరలు కొనటానికి వచ్చినప్పుడు చుట్టూ పక్కల వూళ్ళ నుంచి వచ్చిన రైతులు మార్కెట్‌లో టీ బంక్ దగ్గర కూర్చుని డబ్బు లెక్క చూసుకుని వెళ్ళటం గమనించాడు. చాలా సార్లు వాళ్ళ సాధకబాధకాలు విన్నాడు. ఇదీ మంచి ఐడియా. వాళ్ళని అడిగితే గ్యారంటీగా కష్టాలు ఉంటాయి కాబట్టి డబ్బులివ్వచ్చు... మొహం చాట అంత ఐంది ఆనందరావుకి.

టీ బంక్ దగ్గరికి వెళ్ళాడు.

ఓ ఇద్దరు, ముగ్గురు రైతులతో మాటలు పెంచి– "మీకేమైనా అవసరాలున్నాయా?... డబ్బు కావాలా?" అడిగాడు.

"వడ్డీ వ్యాపారమా?" అడిగారు రైతులు.

"కాదు! కాదు!! నేను ఊరికే ఇస్తాను డబ్బులు. నాకు తిరిగి ఇవ్వక్కర్లేదు"

"ఏందీ! ఊరకే ఇస్తావ్? మేమేమైనా అడు క్కునేవాళ్లమా? చెమట చిందిస్తాం, మా డబ్బు మేం తింటాం. పో పోవయ్యా... నీకు పొద్దున్నే మేం దొరికామా ఆడుకోడానికి" గయ్యిమ న్నారు అందరూ ఒక్కసారి.

"అది కాదు..." సర్దిచెప్పబోయాడు ఆనంద రావు.

"ఏది కాదు" లేచి భుజం మీది తువ్వాళ్ల

దులుపుతూ వచ్చారు మీదకి.

పక్కనుంచి ఆనందరావు మొహం తెల్సిన రైతులు కొంతమంది వచ్చారు.

"అయ్యా మీరా!.. సారు తెల్సిన వాడేలెం డిరా. అయినా మీరేంది సారూ... ప్రపంచంలో ఎక్కడా లేని బేరం ఆడతారు. అట్టాటిది ఊరికే డబ్బులిస్తారా? ఇదిగో తీసుకుపోండి" మిగిలిన ఆకుకూర కట్టలు నాలుగు ఇస్తూ అన్నాడొక రైతు.

అబ్బాబ్బా! ఉట్టి మూర్ఖులులాగ ఉన్నారే. మింగలేను, కక్కలేను.. ఒక్కడికీ డబ్బవసరం లేదా? పైగా నాకే ఆకుకూర ముష్టా!! ఛీ! ఛీ!! నా ఖర్మ ఇలా కాలింది ఇవ్వాళ.


మళ్ళీ నడకదారి పట్టాడు ఆనందరావు.

ఆలోచించాడు కాస్సేపు.

వృద్ధాశ్రమం గుర్తు వచ్చింది. అదేమో వూరి చివర వుంది. పొద్దుటి నుండి ఈ హడావిడిలో సైకిల్ ఎక్కడ మర్చిపోయాడో గుర్తు రాలేదు. బంగారంలాంటి సైకిల్. ఆటోల్లో తిరుగుదామా అంటే తన కోసం ఖర్చు పెట్టకూడదాయే. మళ్ళీ అక్కడికి నడక ప్రారంభించాడు.

విశాలమైన ప్రాంగణం. నిండా పెద్ద పెద్ద చెట్లు. ఎండ అస్సలు తెలీట్లేదు. నీరసంగా ఒక చెట్టు కింది సిమెంట్ బెంచీ మీద కూల బడ్డాడు. దాహం, నోరు ఎండుకుపోతోంది. వాచ్‌మాన్ ఆనందరావు ని చూసి దగ్గర కొచ్చి–

"ఎవరు కావాలి సార్?" అడిగాడు.




"మేనేజర్ గారిని కలవాలి" అడిగాడు.

"రండి" అని ఒక పక్కాగా వున్న ఆఫీస్ రూమ్‌కి తీసుకెళ్లాడు ఆనందరావుని.

చుట్టూ పరికించి చూసాడు ఆనందరావు.

అంతా వృద్ధులు. చిన్నగా నడిచే వాళ్ళు, పేపర్ చదివే వాళ్ళు, బెంచీ మీద కూర్చుని మాట్లాడుకునే వాళ్ళు, ఇంకాస్త పక్కగా వున్న రూముల్లో మంచం మీది పేషెంట్స్... పిల్లలు చూడక వచ్చిన వాళ్ళు కొంత మంది అయితే, ప్రశాంతత కోసం కావాలని వచ్చిన వాళ్ళు మరికొంతమంది.

"కూర్చోండి!" చెప్పాడు మేనేజర్.

ఆనందరావు కూర్చోగానే "చెప్పండి, ఏ పని మీద వచ్చారు?" అడిగాడు అతను.

"మీ ఆశ్రమానికి డబ్బు ఏమైనా ఇస్తే తీసు కుంటారా?" అడిగాడు ఆనందరావు.

"తప్పనిసరిగా" రిసీట్ బుక్ తీస్తూ చెప్పాడు మేనేజర్.

"ఎంత కావాలి మీకు?" అడిగాడు ఆనంద రావు.

"ఈ మధ్యనే మరీ ఒంట్లో బాగోలేని పెద్ద వాళ్ళు కొంతమంది చేరారు. ఒక పది మంచాల దాకా కొనాలి. ఒక ఇరవై వేలేమైనా..." సందే హిస్తూ అన్నాడు మేనేజర్.

సరే అని డబ్బు తీసి ఇచ్చాడు ఆనందరావు.


అడగ్గానే డబ్బులిచ్చినందుకు సంతోష పడ్డాడు మేనేజర్. "మీలాంటి వాళ్ళు ఉండబట్టే ఈ ఆశ్రమాలు నడుస్తున్నాయండి. ఎప్పుడైనా వస్తూ ఉండండి" రసీదు ఆనందరావు చేతిలో పెడుతూ చెప్పాడు.


తలవూపి బయట పడ్డాడు ఆనందరావు.

ఎక్కువ అడిగితే అయన సొమ్మేం పోయిం దిట.. మనసులో తలపోస్తూ నడుస్తున్నాడు.

ఆ రోజు ఇంక ఊరంతా తిరిగాడు..

ప్రతిచోటా బొక్క బోర్లా పడ్డమే గాని, ఫలితం దక్కలేదు. పెద్ద అమౌంట్ అంటే వృద్ధాశ్రమం లో తప్ప ఇంకెక్కడా లేదు. పదీ పరకా తప్ప ఖర్చవ్వలేదు.. ఎండకు ఎండిన మాగాయ ముక్క లాగా అయ్యాడు ఆనందరావు.






తిండి లేదు, తిప్పల్లేవు..డబ్బు ఖర్చు ఎలా చెయ్యాలా అని తప్ప వేరే ఆలోచన లేదు.

సాయంత్రం అవ్వొస్తోంది. డబ్బుతీసుకునే తలకు మాసిన వెధవ ఒక్కడు కనపడడేం. నీరసంగా వుంది. అడుగులు తడబడు తున్నాయి.

సాయంత్రం ఆరు దాటనే దాటింది.

ఉస్సురంటూ ఎటిఎం దగ్గరికి వెళ్ళాడు ఆనందరావు.

డబ్బు ఖర్చు కాలేదు, ఏమౌతుందో ఏమో, మిగిలిన డబ్బుతో పారిపోవటమా? లోపలికి వెళ్లటమా?

కాస్సేపు మీమాంస పడి, అయినా కొంత ఖర్చు చేసా కాబట్టి పర్లేదులే అని తనకు తానే సమాధానము చెప్పుకుని లోపలి వెళ్లి మిషను లో కార్డు పెట్టాడు.

"సారీ! మీకిచ్చిన డబ్బు ఖర్చు కాలేదు కాబట్టి మీ బాలన్స్ జీరో" ఎటిఎంలోంచి హస్కీ వాయిస్ వినిపించింది.

స్క్రీన్ మీద బాలన్స్ సున్నా చూపిస్తోంది.

పదిలక్షలు... పదిలక్షలు .... పోయాయా?! నా డబ్బు... నా డబ్బు... విలపిస్తూ కూలబడి పోయాడు ఆనందరావు.

✦✦✦

మొహాన చల్ల నీళ్లు తగిలే సరికి లేచాడు ఆనందరావు.

"నా డబ్బు! నా డబ్బు!!' అంటూ తలెత్తి చూసాడు.

వరలక్ష్మి చేతిలో గ్లాస్‌తో కనపడింది.

"నా లక్ష్మి... నా లక్ష్మి..." అంటున్నాడు.

"ఏంటి! ఇందాకేమో నా డబ్బు... నా డబ్బు.. ఇప్పుడేమో నా లక్ష్మి... నా లక్ష్మి... లేవండి" ఇంకాసిని నీళ్లు మొహాన కొట్టింది. "త్వరగా లేచి ఎటిఎంకి వెళ్లి రండి" చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

తెప్పరిల్లి చూసాడు.

తన ఇల్లే. తన మంచమే. అంటే ఇదంతా కలా. కానీ నిజంగా జరిగినట్లుందే. చాలాసేపు కల గురించే ఆలోచించాడు ఆనందరావు.


అది కలే అయినా ఒక జీవిత సత్యం నేర్పి నట్లుంది. గుండాయన చెప్పినట్లు "ఏది ఊరికే జరగదు".

లేచి "లక్ష్మి! మొన్న ఒక ఆశ్రమం వాళ్ళు బ్రోచర్ ఇచ్చారు చూడు, అది తీసుకురా" అడిగాడు.

"అదెందుకండీ. ఏమైనా ఇస్తారా పెడ తారా?" వంకరగా అంటూ వచ్చింది వరలక్ష్మి.

"అవునే.. నేను మారిపోయా.. వాళ్ళకి లక్ష రూపాయలు డొనేషన్ ఇస్తా!"

"హా!" మూర్ఛపోవటం వరలక్ష్మి వంత యింది.





# దెయ్యాల కొంప

## కోలపల్లి ఈశ్వర్

"అటులనా దేవరా?... ఇంతకీ ఎవరా అమ్మాయి?" (పల్లవికి, దేవరా అనే పదానికి అర్థం తెలియదు - నాటక ఫక్కీగా బాగుంటుందని వాడిందంతే!)

"తమరికి తెలియదు పాపం!" అంటూ ముసిముసిగా నవ్వాడు రాజేంద్ర.

అతనలా అంటుంటే - అతన్ని చటుక్కున ముద్దు పెట్టేసుకోవాలనిపించింది పల్లవికి.

కలం స్నేహం అంటే ప్రాణం ఇచ్చే అతను, తన కోసం ఇప్పుడు దాన్ని తృణప్రాయంగా భావిస్తున్నాడంటే - ఆయా కలం స్నేహితులందరినీ అడ్డమైన వాళ్ళుగా తీసి పారెయ్యగలుగుతున్నాడంటే... నిజంగా అతని ప్రేమ ఎంత గొప్పది?

అంత గొప్ప ప్రేమని పొందగలిగిన తను నిజంగా ఎంత అదృష్టవంతురాలు.....తను ఈ అదృష్టాన్ని త్వరలోనే చేజిక్కించుకోవాలి.

అలా అనుకుంటుంటే మనసు మురిసి పోతుండగా-'అయితే, నాకోసం మీరింక మీ మిగతా కలం స్నేహితులందరినీ వదిలేసుకో వాలను కుంటున్నారన్నమాట?" అంది అతని కేసి ఆరాధనగా చూస్తూ.

"అవును పల్లవీ! ఇకమీదట నా అమూల్య మైన సమయాన్ని ఒక్క క్షణం కూడా వృధా చేసుకోకూడదని నిశ్చయించుకున్నాను. ఒక సిన్సియర్ ప్రేమికుడిగా అనుక్షణం నా దేవినే ధ్యానిస్తూ కూర్చోవాలని డిసైడైపోయాను...." అన్నాడు రాజేంద్ర. ప్రకోపించిన ప్రేమ మనిషి తో ఎలాంటి మాటలనైనా నిర్లజ్జగా మాట్లాడి స్తుంది. ఇహం, పరం ఏం తెలియనివ్వదు.

"అలాగా!... అయితే మీ దేవిని ధ్యానిస్తూ కూర్చోండి.... నేనింక వెళతాను. మా నాన్న గారొచ్చే టైమయ్యింది." అంటూ చకచకా తమ పోర్షన్‌కేసి సాగిపోయింది పల్లవి.

ఆ సమయంలో శ్రీనివాసరావు ఇంట్లో లేడు.

అంతకుముందు ఎందుకయినా మంచిదని రాజేంద్రనీ, పల్లవినీ ఒంటరిగా వదిలి ఆయన ఎక్కడికి వెళ్ళేవాడు కాదు. కానీ, ఇప్పుడాయన మనస్తత్వంలో మార్పు వచ్చేసింది.

'ఒక తాగుబోతు తమ ఇంట్లో గనక జేరితే -అతనివల్ల పల్లవికి ఏదైనా ప్రమాదం జరుగు తుందేమోనని ఆలోచించే ఉత్తముడు రాజేంద్ర. అలాంటివాడు ఓ పదిహేను నిముషాలు ఒంట రిగా పల్లవి దొరికినంత మాత్రాన్న అనుచి తంగా ప్రవర్తిస్తాడా? నెవ్వర్?" అన్న నమ్మకం ఆయనలో అలాంటి మార్పుకి దోహదపడింది.

అందుకే ఇప్పుడాయన చిన్నా చితకా పను లుంటే - వాళ్ళిద్దరినీ ఒంటరిగా వదిలేసి నిర్భ యంగా వెళ్ళగలుగుతున్నాడు.

పాపం... ఆల్‌రెడీ వాళ్ళిద్దరి మధ్యా ప్రేమ స్టార్టయిపోయిందనీ, మంచి రసకందాయంలో పడబోతుందనీ, అడపాదడపా ఇలా తాను కల్పి స్తున్న ఏకాంతం వల్ల అది ఇంకా ఇంకా బల పడిపోతున్నదనీ ఆయనకి ఏం తెలుసు?... కూతుర్ని చూసి మురిపెంగా నవ్వడం తప్ప.

✦✦✦

నరహరి సలహా మేరకు ఆ రాత్రి శ్రీనివాస రావు ఇంటి మీద మరోసారి రాళ్లవర్షం కురి

**జరిగిన కథ:** శ్రీనివాసరావు ఇంట్లో అద్దెకుండటానికి ఎవరొచ్చినా ఆ ఇంట్లో దెయ్యాలున్నా యని, భయపెట్టి వెనక్కి వెళ్ళిపోయేట్లు చేస్తుంటాడు శ్రీనివాసరావు మేనల్లుడు పాపారావు. రాజేంద్ర కలంస్నేహితురాలు పల్లవి తండ్రి శ్రీనివాసరావు. ఉద్యోగం వచ్చి శ్రీనివాసరావు ఇంట్లో అద్దెకి దిగుతాడు రాజేంద్ర. భానుప్రకాష్‌తో శ్రీనివాసరావు ఇంట్లో దెయ్యాలున్నాయని ఆ ఇంట్లో అద్దెకి దిగొద్దని చెప్తాడు రాజేంద్ర. ఆ విషయం శ్రీనివాసరావుకి తెలిసి కోపంగా రగిలిపోతూ రాజేంద్రని నిలదీస్తాడు. ఆ పరిస్థితి నుంచి సమయస్ఫూర్తితో బయటపడతాడు రాజేంద్ర. పల్లవికి ఓ ఉత్తరం ఇస్తాడు రాజేంద్ర. **అప్పుడు...**

పించాడు పాపారావు.

ఓ అర్ధరాత్రి పూట ఇంటి కప్పుమీద టపీ టపీమని రాళ్ళు పడుతుంటే, రాజేంద్రకు హఠాత్తుగా మెలకువ వచ్చింది.

కాసేపు నిద్రమత్తు వదిలి విన్నాడు.

అది పాపారావ్ పనేనని తెలుసు కాబట్టి, అతను గభాల్న తలుపు తీసుకుని, దూకినట్లుగా వీధిలోకి పరుగెత్తాడు.

పాపారావ్ దొరుకుతాడేమో పట్టుకుందామని.

కానీ అప్పటికే పాపారావ్ అంతర్ధానమయ్యాడు.

వీధివీధంతా నిర్మానుష్యంగా వుంది.

'ఛ! ఛ!! రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోగలిగితే బాగుండేది అనుకుంటూ అతను ఇంట్లోకి తిరిగొచ్చాడు.

అప్పటికే శ్రీనివాసరావూ, పల్లవీ కూడా లేచి కూర్చున్నారు – లైట్లన్నీ వెలిగించి.

"మీరు?... మీరెక్కడికి వెళ్లారు?" పల్లవి అడిగింది రాజేంద్రని ఆవులిస్తూ.

"రాళ్ళవర్షం కురవగానే బయటికి ఉరికాను. వెధవ కానీ దొరికితే, పట్టుకుందామని... ప్చ్! అప్పటికే వెళ్లిపోయాడు." అన్నాడు రాజేంద్ర నిట్టూర్పు విడుస్తూ.

టెన్షన్‌గా ఒక చేత్తో మరొక చేతిని గుద్దుకుంటున్న రాజేంద్రని పల్లవి అపురూపంగా చూసింది – నిద్రకళ్ళతో.

"ఆ వెధవ మనల్ని బ్రతకనిచ్చేలా లేడు." అన్నాడు శ్రీనివాసరావు బాధగా తల పట్టుకుంటూ.

"ఊరుకో నాన్నా!" అన్నట్టుగా పల్లవి తండ్రి భుజంమీద చెయ్యి వేసింది.

దరిమిలా వాళ్ళ ముగ్గురూ దీన్ని గురించే ఓ అరగంట సేపు చర్చించుకున్నారు.

ఆ మీదట మళ్ళీ నిద్రలకి ఉపక్రమించినా, ఏ ఒక్కరికీ సరిగా నిద్ర పట్టలేదు.

రాజేంద్రకయితే మరీనూ....ఏదో మంచం మీద ఒరిగి ఉన్నాడన్న మాటే గానీ, తిరిగి కళ్ళు మూసిన పాపాన్న కూడా పోలేదతను.

ఏదోక రకంగా ఆ పాపారావ్‌గాడి ఆట కట్టించాలి.

ఎలా? ఎలా? ఎలా????

మెదడులోని నరాలన్నీ చిట్లిపోతాయేమోనన్నంత తీవ్రంగా తెల్లవార్లూ ఆలోచిస్తూనే ఉండిపోయాడు.

✦✦✦


ఓ వారం రోజులు అలా దొర్లిపోయాయ్.

శ్రీనివాసరావు ఇంటిముందు 'టులెట్' బోర్డ్ యథాప్రకారంగా వేళ్ళాడుతూనే ఉంది.

'దాన్ని శాశ్వతంగా తొలగించడం ఎలా?' అని రాజేంద్ర ఇంకా తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఈలోగా ముచ్చటగా మూడోసారి మళ్లీ రాళ్లవర్షం కురిసింది ఆ ఇంటి మీద ఆరోజు.

ఈసారి కూడా రాజేంద్ర – పాపారావ్‌ని పట్టుకునే ప్రయత్నం చేసాడు కానీ లాభం లేకపోయింది. ఇతను తలుపులు తీసుకుని






బయటకి వచ్చేలోపలే అతను పలాయనం చిత్తగించేసాడు.

వెధవ పనులు చేసేవాడు అంత తేలిగ్గా దొరుకుతాడా? తన జాగ్రత్తలో తాను ఉంటాడు కదా!

ఆ రాత్రి కూడా ఆ తండ్రీ కూతుళ్ళకీ, రాజేంద్రకీ మళ్లీ శివరాత్రి జాగరణే అయ్యింది.

ఆ మర్నాడు ఇంక ఉపేక్షిస్తే లాభం లేదనీ, డైరెక్ట్ ఎటాకే మేలని భావించి రాజేంద్ర, పాపారావ్ వాళ్లరూమ్‌కి వెళ్లాడు.

పాపారావ్ వాళ్ళు ఉండేది ఫలానా చోట అని అతనికి ఎప్పుడో తెలుసు.

ఏ క్షణంలోనైనా అవసరం పడొచ్చు కదాని పల్లవిని అడిగి తెలుసుకున్నాడు.

రాజేంద్ర వెళ్ళేసరికి షరా మామూలే అన్నట్టు- దుష్టపాండవులు అయిదుగురూ పేకాట ఆడుతున్నారు.

తలుపులు దగ్గరికి చేరేసి ఉండడం వల్ల, నెట్టగానే అవి కిర్రుమంటూ తెరుచుకున్నాయ్.

హఠాత్తుగా అలా ప్రత్యక్షమైన రాజేంద్రని చూసి పాపారావ్ బిత్తరపోయాడు.

మిగతా నలుగురు కూడా అతనికేసి ఆశ్చర్యంగానూ, భయంగానూ చూసారు.

"మీలో పాపారావ్ అంటే ఎవరూ?" రాజేంద్ర నడుం మీద చేతులుంచుకుని ఠీవిగా నిలబడుతూ అడిగాడు.

"నేనే... ఏం? ఏం కావాలి?" పాపారావ్ చేతిలోని పేక ముక్కల్ని కిందపెట్టి రాజేంద్రకేసి కళ్ళు చికిలిస్తూ చూసాడు.

రావడమైతే మహా జోరుగా వచ్చాడు గానీ, ఆ అయిదుగురినీ చూడగానే రాజేంద్రలోని ఆవేశం-పాలపొంగుపై చన్నీళ్ళు చిలకరించినట్టు చప్పున చల్లబడిపోయింది.

వాళ్ళు అయిదుగురు ఉన్నారు.....తనేమో ఒక్కడే! ఇదేమన్నా సినిమానా? ఆ అయిదు గురినీ తానొక్కడూ 'డిష్యూం డిష్యూం' అని ఫైట్ చేసి మట్టి కరిపించేయడానికి?

వాళ్ళు అయిదుగురూ కలిసి తన మీద గాని పడ్డారంటే, తన పని మటాషే. గోవిందా... గోవిందా... అనాలి నలుగురూ కలిసి తనని మోస్తూ.

విజ్ఞత వెన్ను తట్టగా చటుక్కున ప్లేటు ఫిరాయించేసాడు రాజేంద్ర-

"మీరు శ్రీనివాసరావుగారి మేనల్లుడటగా?! నిజమేనా?" అన్నాడు - నడుంమీద నుంచి చేతులు తీసేస్తూ.

"ఆఁ అవును!" అన్నాడు పాపారావ్.

'అయితే ఏవిటంట?' అన్నట్టుగా చూసాడు రాజేంద్రకేసి.

"మీతో కొంచెం మాట్లాడాలి!"

"మాట్లాడండీ...."

"నేనిక్కడ కూర్చోవచ్చా?"

"ఆఁ...ఫర్లేదు...కూర్చోండి..."

రాజేంద్ర కుర్చీలో కూర్చుని, ఓ పొడిదగ్గు దగ్గి గొంతు సవరించుకున్నాడు - పాటలు పాడే గాయకుడికి మల్లే.

అతగాడు అలా మధ్యలో వచ్చి ఆట చెడ గొట్టీ, వింత చూస్తున్నవాడిలా అందరిమధ్యలో అలా కూర్చున్నందుకు అందరికీ కోపం లాంటిది వచ్చినా అతనేం చెబుతాడో - అన్న కుతూహలం కొద్దీ ఆ కోపం లాంటిదాన్ని అణచుకున్నారు.

అందరికందరూ తమ చేతుల్లోని పేక



ముక్కల్ని పక్కన పెట్టేసి, అతనికేసి ఆసక్తిగా చూడసాగారు.

అంతలో గొంతు సవరించుకున్న రాజేంద్ర గళం విప్పాడు.

"నేను మీ మీ మామయ్యగారింట్లో అద్దెకు ఉంటున్నాను." అన్నాడు ఆ చేతి నుండి ఈ చేతికీ, ఈ చేతి నుండి ఆ చేతికీ మొటిమలు విరుచుకుంటూ.

తెలుసు అనబోయి, "అలాగా?" అన్నాడు పాపారావు.

"ఆ ఇంట్లో ఈ మధ్య కొన్ని విచిత్రమైన సంఘటనలు జరిగాయి..." రాజేంద్ర మనసులో ఓ ఐడియాకి రూపకల్పన చేసుకుంటూ అన్నాడు.

లోపల్లోపల అతను రిహార్సల్స్ చేసుకుంటున్నాడు. ఇదమిత్థంగా ఓ రూపం ఏర్పడుతుంది.

"విచిత్రమైన సంఘటనలా? అంటే...!" ఏమి తెలియన నంగనాచిలా ముఖం పెట్టి, ఆ ముఖాన్ని కూడా చాలా అమాయకంగా పెట్టి అడిగాడు పాపారావు.

"అర్ధరాత్రిపూట ఇంటి మీద రాళ్ల వర్షం కురవడం... వరండా మీద పుర్రెలూ గత్రా ప్రత్యక్షం కావడం... ఇలాంటి భయంకరమైన సంఘటనలన్నీ జరుగుతున్నాయి ఆ ఇంట్లో." రాజేంద్ర ముఖం నిండా భయాన్ని పులుముకుంటూ చెప్పాడు.




"దెయ్యాల కొంపలో అలాగే జరుగుతుంది మరి!" అన్నాడు పాపారావు చాలా తేలికగా– అందులో వింత ఏముంది? సహజమే కదా? అన్నట్లు ముఖం పెట్టి!

"నేనూ అదే అనుకుంటున్నానండీ... కానీ ఆ శ్రీనివాసరావుగారేమో అస్సలు వాళ్ళింట్లో దెయ్యాలే లేవంటున్నారు... వారి మీద పగతో మీరే ఇదంతా చేస్తున్నారని... లేదా వెనక ఉండి చేయిస్తున్నారని అంటున్నారు... ఈ వారంలో ఇప్పటికీ రెండుసార్లు కురిసింది రాళ్లవర్షం. నాకు ఆ ఇంట్లో ఉండాలంటే వణుకు పుడుతోంది. అందుకే ఇందులో నిజం ఎంతో తెలుసుకుందామని మీ దగ్గరకు వచ్చాను." రాజేంద్ర కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ అన్నాడు.

నిజానికి అతనికి చెమటలు ఏం పట్టలేదు. కానీ ఊరకనే ఎఫెక్ట్ కోసం అలా తుడుచుకున్నాడు... డ్రమటిక్‌గా ఉంటుందని.


పాపారావుకి మతి పోయినట్లుగా అనిపించింది.


'ఇదేంటీ!... గురుడు ఈ ట్రాక్‌లోకి వచ్చాడు?' అనుకున్నాడు ఆశ్చర్యంగా.

వెంటనే అతని బుర్ర పాదరసంలా పని చేసింది. అయితే ఇతనింక ఊగిసలాటలో ఉన్నాడన్నమాట! మరికాస్త బెదరగొడితే ఇల్లు ఖాళీ చేసేసి వెళ్ళి పోతాడన్నమాట!

'శుభం!' అని మనసులో అనుకుని–" ఆయనకి మరో దారి లేక అబద్ధాలు చెబుతుంటాడండీ... ఆ ఇంట్లో దెయ్యాలున్నాయన్న మాట నూటికి నూరు పాళ్ళు నిజం! ముమ్మాటికీ నిజం!! మా అత్తయని పొట్టన పెట్టుకున్నది కూడా ఆ దెయ్యాలే కదా? ఒకప్పుడు నేను కూడా అక్కడే ఉండేవాణ్ణి కదా? అసలు నేను అక్కడ్నుంచి వచ్చేసింది కూడా ఆ దయ్యాల బాధ భరించలేకనే." అన్నాడు పాపారావ్.

"అయితే నిజంగా అక్కడ దెయ్యాలున్నాయంటారా? ఇవన్నీ మీరు చేస్తున్న పనులు కావా అయితే? అన్నాడు ముఖం మీద మరి కాస్త భయం పలుముకుంటూ! **(సశేషం)**





క్యా కరోనా
ఆరోపల్లి ఆనంద్
ఈ కరోనా లాక్ డౌన్ వల్ల నాకు తెలిసొచ్చిన సత్యం ...
మగవాళ్ళు ఆఫీస్ కెడితేనే ఆడవాళ్ళు సుఖపడతారు!
లేకపోతే టిఫిన్లు, కాఫీలు, చిరుతిళ్ళు అందించలేక చావాలి!
మీ శిష్యుడు 'దగ్గు, జలుబు' తో బాధ పడుతూ రాత్రి
యింటి కొచ్చేసారు! తగిన జాగ్రత్తలు తీసుకొంటూ, ఇంటి
దగ్గిరే వుండి 'తపస్సు' చేసుకొంటానని మీకు చెప్ప
రమ్మన్నారు స్వామీ!
'కరోనా' గొడవలో ఎవరూ రాకపోయినా పెళ్ళి అయిందనిపించాం!
ఇప్పుడు నువ్వేమో సామాజిక దూరం పాటించాలని 'గోరింటాకు'
పెట్టుకూర్చున్నావా?
SWEET DREAMS
కంగారు పడకు! మీ బావగారే! బ్యాంకు వాళ్ళు సేఫ్టీ కోసం కరోనా
బారిన పడకుండా 'పి. పి. ఈ' కిట్లు ఇచ్చారు!
DR. RAO MANAGER
ఆరోపల్లి ఆనంద్



# అమౌనం అర్ధాంగికాభరణం


కట్టా రాంబాబు-
9440140510

**"నీకు పట్టిన అదృష్టం గురించి నీకు తెలియడం లేదురా చక్రీ.... అలాంటిది మాకు కలగలేదని మేమేడుస్తున్నాం. కలిగినందుకు నువ్వుబాధ పడుతున్నావ్" అన్నాడు భాస్కరం.**

**"నిజమేరా చక్రీ భాస్కరంగాడు చెప్పింది అక్షరసత్యం. మన ఫ్రండ్స్‌లో ఎవరికీ పట్టని అదృష్టం నీకు పట్టింది. హాయిగా ఎంజాయ్ చేయక ఆ ఏడుపు గొట్టు మొహమేమిటిరా" అన్నాడు సుబ్బారావు.**

చక్రీ అనబడే చక్రవర్తికి నిజంగా పిచ్చెక్కినట్టుంది.

తను పడుతున్న బాధేమిటి... వీళ్ళంటున్న మాటలేమిటి?... నిజంగా ఇంట్లో పెళ్ళాం మాట్లాడకుండా వుంటే అది అదృష్టమా?...ఎలా అవుతుంది! ఇద్దరూ ఆనందంగా కబుర్లు చెప్పుకుంటు కాపురం చేసుకుంటుంటే వుండే హాయి ఎలా వుంటుందో వీళ్ళకు తెలియదా? అసలు వీళ్ళిలా ఎందుకంటున్నారు?

"ఒరే చక్రీ! ఇంతకీ నీ పెళ్ళానికీ నీకు గొడవెందుకొచ్చిం దిరా? మాట్లాడుకోనంత పోట్లాట జరిగిందా?" అడిగాడు భాస్కరం.

"ఏం చెప్పేదిరా! ఓ సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికొచ్చి చిన్న పని మీద బయటకి వెళుతుంటే మల్లెపూలు తెమ్మంది మా ఆవిడ నవ్వుతూ. సరే కదా అని ఆనందంగా, హుషారుగా బయటకొచ్చాను. పని పూర్తి చేసుకుని ఇంటికెళ్ళే ముందు మా ఆవిడ చెప్పినట్టుగా పూలు కొందామని పూలకొట్టు దగ్గరకెళ్ళి మూరెంత అనడిగాను. మల్లెపూలయితే పాతిక, సన్నజాజులైతే ఇరవై అన్నాడు పూలమ్మేవాడు. అనవసరంగా అయిదు రూపాయలెక్కువ పెట్టడమెందుకని ఓమూర సన్నజాజులు తీసుకున్నాను. అందులోను సన్నజాజులైతే మంచి సువాసనలొస్తాయి. నాకు మల్లెపూల కంటే సన్నజాజులంటేనే ఎక్కువిష్టం. అందుకే అవి తీసుకుని ఇంటికెళ్ళి పూలపొట్లం మా అవిడ చేతిలో పెట్టాను. అంతే! నా కొంప కొల్లేరయిపోయింది" అన్నాడు చక్రీ కళ్ళనీళ్ళు పెట్టుకుని.

"ఏమయిందిరా?!" అన్నారిద్దరూ.

"ఏంచెప్పమంటార్రా! మల్లెపూలు తెమ్మంటే సన్న జాజులెందుకు తెచ్చావంటూ గొడవ పడింది రా మా ఆవిడ....పూలు తెమ్మంటే మూరేనా తెచ్చేది రెండు, మూడు మూరలు తెస్తే నీ సొమ్మేం పోయిందంటూ ఏక వచన ప్రయోగంతో పోట్లాడిందిరా!

విషయం చెప్పాను... అంతే రుద్రకాళి అయిపోయింది. 'అయిదు రూపాయలకు కక్కుర్తిపడి మల్లెపూలకి బదులు సన్నజాజులు తెస్తావా?' అంటూ సీరియస్సయ్యింది. మూరయినా, రెండుమూర్లయినా ఏ పూల యితే మాత్రం ఏముంది పెట్టుకుంటే ఆ తర్వాత నలిగిపోయేవేగా అన్నాను ఓరగా చూస్తూ.

ఇంక చూస్కో శివాలెత్తేసింది. ఈ మాత్రం సరసానికి పూలుకావలసివచ్చయా! నేను తెమ్మన్నది దేవుడికి పెట్టడా నికి నీకోసం, నాకోసం కాదు. నేను పూజించే దేవుడికి, సన్నజాజులు పెట్టకూడదు. అందుకే మల్లెపూలు తెమ్మ న్నాను. కానీ తగుదునమ్మా అంటూ సన్నజాజులతో తయా రయ్యారు అంటు నేను తెచ్చిన సన్నజాజుల్ని బయటకు విసిరేసింది.


అంతే ఆ రాత్రి నుంచీ మాట్లాడటం మానేసింది. అప్ప ట్నించీ అంటే వారం రోజుల నుంచీ ఈ రోజు వరకు

మా మధ్య మాటల్లేవు. రోజూ ఉదయం టిఫిన్ చేసి డైనింగ్ టేబులు మీద పెడుతుంది. లంచ్ బాక్సుకూడా రెడీ చేస్తుంది, సైలెంటుగా టిఫిన్ చేసి లంచ్‌బాక్సు తీసుకుని వస్తున్నాను. ఇల్లంతా నిశ్శబ్దంగా వుండటంతో భరించలేక పోతున్నా న్రా నేను మాట్లాడ్డానికి ప్రయత్నించినా పలకడం లేదు. నిజంగా పిచ్చెక్కి పోతుందనుకో" ముగించాడు చక్రీ కళ్ళు తుడుచుకుంటూ.

ఇద్దరికీ చిత్రంగా అనిపించింది. ఇంత చిన్నవిషయామా వీళ్ళిద్దరి మధ్య మాటల్లేక పోవడానికి కారణం.

"ఒరే చక్రీ! ఇదేంట్రా ఇంత చిన్న విషయానికి పోట్లాడి నీతో మాట్లాడకుండా వుండటమేమిటి చెప్పు. మా ఇంట్లో అయితే యుద్ధాలు జరిగినా మౌనంగా వుండటమనేది మా ఆవిడ జాతకంలో లేదురా! చెప్పుకుంటే సిగ్గుచేటు మా ఆవిడ ఎంత ఘోరంగా తిడుతుందో తెలుసా? మాటల్లో చెప్పలేం... రోజూ తిట్లుకోవడంతోనే జీవితం గడిచిపోతుందనుకో. ఇంట్లో అర్ధాంగి ముభావంగా ఎలా వుండగలదు చెప్పు... అది వాళ్ళకి ఆభరణం కదా!" అన్నాడు సుబ్బారావు.

"ఒరే చక్రీ! ఈ సుబ్బిగాడి భాగోతానిదేముందిలే వాడు రోజూ రెండు పెగ్గులేసుకుని ఇంటికెళతాడు. ఇంక వాడి పెళ్ళాం పోట్లాడక ఏం చేస్తుంది చెప్పు! నా విషయ విషయమలా కాదు రోయ్. నా చేతే తప్పుచేయించి మరీ పోట్లాట పెట్టుకుంటుంది మా ఆవిడ. ఓసారేం




జరిగిందో చెప్పమంటావా?" అంటూ చెప్పడం ప్రారంభించాడు భాస్కరం.

"ఆరోజు ఉదయం హడావిడిగా ఆఫీసుకు తయారవుతున్నాను ఇన్స్‌పెక్షనుందని. తనూ పిల్లల్ని స్కూలుకి తయారు చేస్తూ బిజీగా వుంది. 'టిఫిన్ మీరు తినెయ్యండి. ఇడ్లీలు హాట్‌పాక్‌లో వున్నాయి. ప్లేటు కూడా పెట్టాను. అన్నీ డైనింగ్ టేబులు మీదున్నాయి. చట్నీ చేసి మిక్సీ పక్కన వుంచేసాను కొంచెం కిచెన్‌లో నుంచి తెచ్చుకుని ఇడ్లీపెట్టుకుని తినండి" అంటూ చెప్పింది.


సరే తనూ ఖాళీగా లేదు కదా అనుకుని మిక్సీ పక్కనే వున్న చట్నీ గిన్నెను తెచ్చుకుని ఇడ్లీ పెట్టుకుని తినడం మొదలెట్టాను. చట్నీ ఏదో డిఫరెంట్ టేస్ట్‌గా వుంది ఎప్పుడూ చేసినట్లుగా లేదు. కొంచెం చేదుగా, ఒగరుగావుంది. ఏదో కంగారులో చేసుంటుందిలే అనుకుని ఇడ్లీ తినేసి ప్లేటు సింకులో పడేసి చేతులు కడుక్కుంటున్నాను. అంతలో మా ఆవిడ ఒంట గదిలో కెళ్ళి కెవ్‌మని అరిచింది. ఏం జరిగిందోనని కంగారుపడుతూ అక్కడికెళ్ళాను.

"మీకేమైనా బుద్ధుందా మీరు చేసిందేమిటి?" అంటూ గట్టిగా అరిచింది.

"నేనేం చేసానే?... అలా అరుస్తావు. టిఫిన్ పెట్టుకుని తిన్నాను. చట్నీ మిక్సీ పక్కనే వుంది కదా అదే తీసుకున్నాను." అన్నాను.

"అఘోరించారు! మీరు ఇడ్లీలో తిన్నది చట్నీ కాదు. నేను తలకి పెట్టుకుందామని మందారాలు, మెంతులు, ఉసిరిపొడితో చేసుకున్న హెన్నా. మిక్సీలో గ్రైండ్ చేసి గిన్నెలో పెట్టి దాని పక్కనే పెట్టాను. ఆ పక్కనే చట్నీ గిన్నె వుంది. ఏది చట్నీనో, ఏది హెన్నానో తెలియక పోతే ఎట్లా? మరీ మట్టి బుర్రయితే ఎలా?" అంటూ చడా, మడా తిట్టిపోసింది.

నేను ఇడ్లీలో హెన్నా నంజుకుని తినడంవల్ల నాకేమవుతుందోననే దానికంటే తన తలకు పెట్టుకోవడానికి హెన్నా లేకుండా చేసానని నామీద పోట్లాట పెట్టుకుంది. ఆ రోజంతా పోట్లాడుతూనే వుంది. హెన్నాపెట్టుకోవడం అవలేదని. నేనూ ఊరుకోలేదు తనకంటే గట్టి




గానే అరిచాను. అనరాని మాటలన్నాను. మరో ఆడదయితే కోపంతో పుట్టింటికైనా పోయుండాలి లేకపోతే ఆత్మహత్యయినా చేసుకునుండాలి అబ్బే అలాంటిదేమి లేదు. తగుదునమ్మా అనుకుంటూ మర్నాటినుంచి మామూలే! ఈ ఆడాళ్ళు మౌనంగా అసలుండలేరు. మరి మీ ఆవిడ అలా చిన్న విషయానికే ఎందుకు మాట్లాడకుండా వుందో నాకయితే అసలు అర్థం కావడంలేదు" అన్నాడు భాస్కరం.

చక్రవర్తికి నిజంగా అర్థం కాలేదు భార్య అలా ఎందుకుంటుందో? తను బాగానే చూసుకుంటాడే. ప్రాణంతో సమానంగా ప్రేమిస్తున్నాడు. ఆమెకూ తనంటే ప్రేమే. మరెందుకు తనని దూరంగా వుంచుతుంది. ఇంతకుముందెప్పుడూ ఇలా చెయ్యలేదు.

ముగ్గురూ పార్కు నుంచి బయటకొచ్చారు.

చక్రవర్తికి ఇంటికెళ్ళాలనిపించడంలేదు. ఎప్పుడూ గలగలా సెలయేరులా వుండే భార్య అలా నిశ్శబ్దంగా వుంటుంటే అసలు భరించలేక పోతున్నాడు. అయినా తప్పదు ఇంటికెళ్ళవలసిందే కదా! ఇంటికి బయలు దేరాడు.

నెమ్మదిగా ఇంట్లోకడుగుపెట్టాడు. భయంకరమైన నిశ్శబ్దం. అలాగే నడుచుకుంటూ బెడ్ రూములోకడుగుపెట్టాడు. కళ్ళు తిరిగినంత పనైంది. రూమంతా అగరుబత్తీల పొగతో సువాసనలు వెదజల్లుతున్నాయి. డబుల్‌కాట్ బెడ్ మీద తెల్లని దుప్పటి, దాన్నిండా విడిమల్లెలు




చల్లివున్నాయి. ఆశ్చర్యంగా గదంతా చూసాడు. భార్యలేదక్కడ... అసలిదంతా ఏమిటి? మాయలా వుంది. పిచ్చెక్కిపోతుంది చక్రవర్తికి.

ఒక్కసారిగా బయట నుంచి సుడిగాలొచ్చినట్లు విసురుగా వచ్చి తనని వెనుక నుంచి గట్టిగా అల్లుకుపోయింది శ్రీమతి. ఆ హటాత్ సంఘటనకు ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు చక్రవర్తి.

తనని చుట్టుకున్న ఆమె చేతుల్ని నెమ్మదిగా విడిపించి తన వైపుకి తిప్పుకున్నాడు.

అతని గుండెల్లో తల దాచుకుని బావురుమంది భార్య.


"ఏమయింది? ఏమిటిదంతా?!" అన్నాడు అనునయంగా.

"నన్ను క్షమించండి. పాపిష్టిదాన్ని మిమ్మల్నెంత బాధపెట్టానో! అసలేం జరిగిందంటే... పది రోజుల క్రితం గుడికెళ్ళినప్పుడు అక్కడ పంతులుగారు ఓ వ్రతం గురించి చెప్పారు. దాన్ని వారం రోజులపాటు నిష్టగా చేస్తే మీరు క్షేమంగాను, నేను సౌభాగ్యవతిగాను వుంటామట. అందుకోసం నేనా వ్రతాన్ని చేయాలనుకున్నాను. మీతో నేను మామూలుగా వుంటే నిష్టగా వుండలేను... నన్ను మీరుండనివ్వరు కాబట్టి మీతో ఏదోరకంగా గొడవ పెట్టుకుని మిమ్మల్ని దూరంగావుంచాలనుకున్నాను. అందుకే మీతో అలా వుండవలసివచ్చింది.

ఈ రోజు ఉదయంతో ఆ వ్రతం పూర్తయింది. గుడికెళ్ళి పంతులుగారి ఆశీర్వచనం తీసుకున్నాను...

ఈ రోజునుంచీ మీతో సుఖంగా కాపురం చేసుకోవచ్చన్నారు."

నవ్వాలో ఏడవాలో తెలియక పెట్టిన అతని ముఖమెలా ఉందో మీరే ఊహించుకోండి!



# బహుముఖ ప్రజ్ఞాశాలి పి.వి.నరసింహారావు క్యారికేచర్ కాంపిటీషన్



తెలంగాణ కార్టూనిస్టుల సంక్షేమ సంఘం మొదటిసారి అంతర్జాతీయ స్థాయిలో స్వర్గీయ పీవీ నరసింహారావు శత జయంతిని (జూన్ 28 వ తేదీ) పురస్కరించుకుని క్యారికేచర్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది.


వివిధ కారణాల వలన పోటీ గడువు కాలం తక్కువ అయినను దేశ విదేశాల్లో ఉన్న చిత్రకారులు, కార్టూనిస్టులు 216 మంది ఈ పోటీలో పాల్గొని ఈ కార్యక్రమానికి అద్భుతమైన విజయాన్ని అందించారు.

ఈ పోటీ విజయానికి స్పందించి బెంగళూర్‌లోని IIC వారు ఈ క్యారికేచర్‌ల ప్రదర్శనకు అనుమతి ఇచ్చారు.


ఈ పోటీ ఇక నుంచి ప్రతి ఏటా కొనసాగుతుంది అని తెలంగాణ కార్టూనిస్ట్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి ఒక ప్రకటనలో తెలియజేసారు.

## ఎందుకంటే...








అరెరే... ఏమయ్యింది ఏమిటీ కట్లు ?
అంతా నా దురదృష్టం...
సుత్తి
అసలు ఏం జరిగింది ?
సుత్తి జారి 3వ అంతస్తు నుంచి కింద పడింది!
సుత్తి జారి పడినంత మాత్రాన నీకు ఏం కాదు కదా !!
జారి పడుతున్నప్పుడు సుత్తి నా చేతిలోంచి వదల్లేదు
DAYAKAR







కార్టూనిస్ట్ Krishna
ఫన్ ప్రశ్నలకు-
సుదర్శనమ్ పంచ్ సమాధానాలు




✦ మీరు హీరోగా ఐశ్వర్యరాయ్ హీరోయిన్‌గా సినిమా అవకాశం వస్తే ఎగిరి గంతేస్తారా?

**ఇప్పటికే చాన్నాళ్ళుగా నాకూ అభికి (అదే...అభిషేక్‌ని నేను అలా పిలుస్తా) 'అభి'ప్రాయభేదాలున్నాయి... ఇప్పుడు మీరు కొత్తగా ఈ ఫిటింగ్‌లు పెట్టకండి! (మా గొడవల వల్ల 'ఐష్' ఫీలైతే నేను తట్టుకోలేను.**

✦ భౌతిక దూరం నేపథ్యంలో సినిమాల్లో లిప్‌లాక్ సీన్లు ఎలా తీస్తారంటారు?





**క్లోజప్పులో లిప్పులని చూపించి... కిస్సుని గ్రాఫిక్స్‌లో తీస్తారు! (ప్రస్తుతానికి సరిపెట్టుకోండి సార్... మీ కక్కుర్తి కరోనా ఎత్తుకెళ్ళా!)**



✦ మీ గుండుని చూస్కుని గర్వంగా ఫీలయ్యారా ఎప్పుడైనా?

**చందమామలా ఉందని కొందరు నిమిరినప్పుడు- (టెన్షన్ పడకండి...లేడీసేలెండి!) వెన్నముద్దలా ఉందని మరి కొందరు ముద్దాడినప్పుడు- (ఎగ్జైటు అవకండి...జెంట్సేలెండి!)**





✦ ఇప్పుడు ఎక్కడ చూసినా 'ఆన్‌లైన్', 'ఆన్‌లైన్' అంటున్నారు. సినిమా షూటింగులు కూడా 'ఆన్‌లైన్'లో చెయ్యొచ్చుగా!

**ఫస్ట్‌నైట్లు, హనీమూన్లు, సంసారాలు కూడా... ఆన్‌లైన్లో చేసుకోమని చెప్పొచ్చుగా!**

✦ తెలుగు సినిమా స్థాయి బాగా పెరిగిందట... ఏ విషయంలో అంటారు?


**పెట్టిందానికి... రెట్టింపు రాబట్టుకునే మార్కెటింగ్ స్కిల్లు విషయంలో!**




✦ మిమ్మల్ని హెయిర్‌ఆయిల్ యాడ్‌లో నటించడానికి తీసుకుంటే మనసులో ఏమనుకుంటారు?




**ఈ యాడ్ ఏ హెయిర్ (అదే... గడ్డాలకా, మీసాలకా) ఆయిల్‌కి అని ఆశ్చర్య పోకుండా... చెక్కు ముందే తీసేస్కుని, షూటింగ్ చేసేస్కుని... చక్కా వస్తా!**




✦ కరోనా వచ్చి మీ ఇంటి తలుపు తడితే ఏం చేస్తారు మీరు?


**రాంగ్ అడ్రస్ అని చెప్పి... 'మీ' ఇంటి అడ్రస్ ఇస్తా!**




✦ నేటి న్యూస్‌రీడర్ల తెలుగు విని తెలుగు తల్లి ఎలా ఫీలవుతోందంటారు?

**ఆ తెలుగుని 'మదర్‌టంగ్' అంటున్నందుకు హర్ట్ అవుతుంది.**

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P



రోజూ వాకింగ్ కెళ్ళమని ఎందుకు
సతాయిస్తావ్.. కావలిస్తే ఎవర్నైనా
అడుగుదాంరా.. ఎవరు లావున్నారో..!!?
ఎందుకలా హెవీ ఎక్సర్‌సైజులు చేస్తారు..
తర్వాత సన్నబడి బట్టలన్నీ లూజైపోతే
అవన్నీ ముష్టోళ్ళకిస్తారా?
జస్ట్ కిడ్స్ అని ఒక వాట్సప్ గ్రూప్
క్రియేట్ చేసిచ్చా.. వాళ్ళతో చాటింగుల్లో
మునిగిపోయి ఇప్పుడసలు ఏడవట్లా!!
దేవుడు ప్రతి ఇంటి
లోనూ ఉండలేడు
కాబట్టి తన బదులు
భర్తను సృష్టించాడు
బాబా
అవకాశ్‌వాద్
గారి
ప్రవచనాలు
పురుషుల
ప్రత్యేకం
నిన్న మహిళల సభలో
ఈ మాట భార్యల
రూపంలో అని చెప్పాడు
వచ్చే జన్మలో కూడా నువ్వే
నా భార్యగా రావాలని
దేవుని కోరుకున్నా!!
సర్లే... ఆ జన్మలోనన్నా
చీరలూ నగలూ
కొనిచ్చేడుస్తారా??






With Jaquar Taps

Best Cartoon of the Month




**Sambamurthy Enterprises**

12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548